# మన క్రాంతి

KR TV

ఇది వాస్తవ పత్రిక...


**నేటి మాట**

పిరికితనం మనిషిని నిర్వీర్యుడ్ని చేస్తుంది, ఆత్మవిశ్వాసం మనిషిని విజయపథం వైపు నడిపిస్తుంది



-స్వామి వివేకానంద


Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati


సంపుటి: 02 సంచిక 70 | గురువారం 26 ఫిబ్రవరి 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-


## పీఎం ఆవాస్ యోజన 2.0 జోరు

### పట్టణ పేదలకు రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పట్టణాల్లో ఉన్న పేదలకు పీఎం ఆవాస్ యోజన 2.0 పథకం శుభవార్తను అందించింది. కేంద్ర ప్రభుత్వం పట్టణ పేదలకు సొంత ఇంటి కలను నిజం చేసే లక్ష్యంతో చేపట్టిన పథకం కింద మరో భారీ ముందడుగు వేసింది. తాజాగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో దేశవ్యాప్తంగా కొత్తగా 2.88 లక్షల (2,87,618) ఇళ్ల నిర్మాణానికి కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పిఎంఏవై-యూ 2.0 పథకం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు మంజూరైన మొత్తం ఇళ్ల సంఖ్య 13.61 లక్షలకు చేరింది. తాజా విడతలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా మొత్తం 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లబ్ధి చేకూరనుంది.

ఈ కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వ సామాజిక సమతుల్యతకు, మహిళా సాధికారతకు పెద్దపీట వేసింది. మంజూరైన మొత్తం ఇళ్లలో సింహభాగం అంటే సుమారు 1.60 లక్షల ఇళ్లను మహిళల పేరుతోనే కేటాయించనున్నారు. అలాగే సామాజిక వర్గాల వారీగా చూస్తే.. ఓబీసీలకు 82,190 ఇళ్లు, ఎస్సీలకు 35,525, ఎస్టీలకు 9,773, సీనియర్ సిటిజన్లకు




22,581 ఇళ్లను కేటాయించారు. ట్రాన్స్‌జెండర్లకు సైతం ప్రత్యేకంగా 8 యూనిట్లు మంజూరు చేయడం విశేషం. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ ఖర్చులో ప్రభుత్వం నుంచి రూ. 2.50 లక్షల వరకు నేరుగా ఆర్థిక సాయం అందనుంది.

## భారత్ - పాక్ అణుయుద్ధంపై ట్రంప్ సంచలనం

అణుయుద్ధం ఆపింది తానేనని ప్రకటన

200% టారిఫ్‌లతో హెచ్చరిక

పహల్గాం దాడి తర్వాత ఉద్రిక్తతలు

భారత విదేశీ వ్యవహారాల శాఖ ఖండన




## యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

ప్రపంచ యాత్రికుడి అరెస్టు తప్పదా?

కరాటే కల్యాణి ఫిర్యాదుతో కేసు

పంజాగుట్ట పోలీసుల లుకౌట్ నోటీసులు

సోషల్ మీడియా వేదికలకు లేఖలు

రెడ్ కార్నర్ నోటీసుల డిమాండ్




## రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద అవినీతి

ప్రభుత్వ అధికారి ఇంట్లో కుప్పలు

తెప్పలుగా నగదు

ఒడిశా విజిలెన్స్ విభాగం భారీ సోదాలు

కటక్ గనుల శాఖ అధికారి ఇంట్లో తనిఖీలు

రూ.30,000 లంచం ఆరోపణలపై చర్య

కోట్ల రూపాయల నగదు స్వాధీనం

ఆస్తులపై లోతైన దర్యాప్తు




## చిన్నారి పునర్వికా దాతలకు అలర్ట్

ఇకపై నిధులు పంపవద్దని తండ్రి రిక్వెస్ట్

సోషల్ మీడియాలో విరాళాలు

16 కోట్లు ఖర్చు ఇంజెక్షన్

వైద్యులు ప్రాణాలు కాపాడే ఏర్పాట్లు




## బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని సూసైడ్ కేసులో ట్విస్ట్

- ప్రేమ వ్యవహారం కోణంలో పోలీసుల దర్యాప్తు
- హైదరాబాద్‌లో గణేష్ ఆత్మహత్య వెలుగులోకి
- గాయాలపై విద్యార్థుల అనుమానాలు
- చివరి ఫోన్ కాల్‌పై సస్పెన్స్







## తెలంగాణ పల్లెల్లో ఇంటర్నెట్ విప్లవం

### టీ-ఫైబర్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- భారత్‌నెట్ ఫేజ్‌ల ఉద్దేశ్యం
- జిల్లాల వారీ విస్తరణ ప్రణాళిక
- సేవలు అందించే గ్రామాల సంఖ్య
- ఇంటర్నెట్ కనెక్షన్ ఖర్చుల విధానం
- రాష్ట్ర-కేంద్ర సమన్వయం
- గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవల అభివృద్ధి
- పైలట్ ప్రాజెక్ట్ మరియు కరీంనగర్ ప్రారంభం

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్)

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు వేగవంతమైన ఇంటర్నెట్ సదుపాయాన్ని అందించాలని టీ-ఫైబర్ సంకల్పించింది. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగానూ ఇప్పటికే కేబుల్‌ను అందుబాటులోకి తెచ్చింది. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా టీ-ఫైబర్ అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధం అవుతుంది. అయితే.. కేంద్రం నుంచి టీ-ఫైబర్‌కు ఓ గుడ్‌న్యూస్ వచ్చింది. వేగవంతమైన ఇంటర్నెట్ సేవలందించేందుకు టీ-ఫైబర్ చేస్తున్న ప్రయత్నానికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు ముందుకొచ్చింది. భారత ప్రభుత్వం సవరించిన భారత్‌నెట్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద తెలంగాణకు రూ.3,185 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది.


మిగతా 2 లో


## ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని

- నారా లోకేశ్ స్పష్టత
- ఏపీకి ఒకే రాజధాని నినాదం
- 22 క్లస్టర్ల అభివృద్ధి ప్రణాళిక
- గత ప్రభుత్వ మూడు రాజధానుల విధానం
- అసెంబ్లీలో రాజధాని అంశంపై చర్చ




## అఖిలేష్ యాదవ్ బిగ్ ప్లాన్

- యూపీ ఎన్నికల కోసం ఐ-ప్యాక్‌తో డీల్
- యూపీ 2027 ఎన్నికల సిద్ధం
- జిల్లా, బూత్ స్థాయిలో ప్రచారం
- ఐ-ప్యాక్: రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ
- మార్చి 28న సమర శంఖారావం, నోయిడా ర్యాలీ ప్రారంభం




## ఎప్‌స్టీన్ వివాదం.. తప్పు ఒప్పుకున్న బిల్‌గేట్స్.. కానీ!

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ప్రపంచ కుబేరుడు, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ పేరు మరోసారి వార్తల్లో నిలిచింది. అది కూడా ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన 'ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం'లో.. జెఫ్రీ ఎప్‌స్టీన్ అక్రమ దందాలకు సంబంధించిన కీలక పత్రాలు బయటకు రావడం, అందులో బిల్‌గేట్స్ పేరు కూడా ఉండటంతో సర్వత్రా చర్చ మొదలైంది. ఈ వివాదంపై తాజాగా బిల్‌గేట్స్ నోరు విప్పారు. తాను చేసిన పొరపాట్లను అంగీకరిస్తూనే, కొన్ని సంచలన నిజాలను బయటపెట్టారు. తన ఫౌండేషన్ సభ్యులకు క్షమాపణలు చెబుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. అసలు ఎప్‌స్టీన్‌తో బిల్‌గేట్స్‌కు ఉన్న సంబంధమేంటి? ఆ రష్యన్ మహిళల కథేంటి? మెలిండా గేట్స్ హెచ్చరించినా ఆయన ఎందుకు




వినలేదు? అనేది ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.

బిల్‌గేట్స్ తాజాగా 'ది వాల్ స్ట్రీట్ జర్నల్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పేర్కొన్నట్లుగా, తనకు ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధం ఉన్న మాట వాస్తవమేనని బిల్‌గేట్స్ అంగీకరించారు.

## రెండునెలల పసిగుడ్డు ఏం చేసిందని చంపేశారు? : కేటీఆర్ ధ్వజం

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలంగాణలో హత్యారాజకీయాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి ప్రాణాలు తీయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బాధిత కుటుంబం చేపట్టిన దీక్షలో కేటీఆర్ పాల్గొన్నారు. వారికి తన మద్దతు తెలిపి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రెండునెలల పసిగుడ్డు ఏం పాపం చేసిందని, ఏం అడిగిందని పొట్టనపెట్టుకున్నారని ప్రశ్నించారు. మాటలకు, ఊహలకు అందని మహావిషాదమని, కుమ్మెర జాతరలో జరిగిన ఘటనకు తెలంగాణ సమాజమే తలదించుకోవాలన్నారు. మానవత్వానికి మాయని




మచ్చ ఇది అని, దీనిపై రాజకీయాలు మాట్లాడటం సరికాదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకూ పోరాడుతామని తెలిపారు. పసిపాప ప్రాణాలను బలిగొన్న హంతకులకు ఎవరూ అండగా నిలబడవద్దని విజ్ఞప్తి చేశారు. చిన్నారి, తల్లిదండ్రులపై ఇష్టానుసారంగా దాడిచేసి, కులంపేరుతో దూషించిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# డయేరియా విజృంభణ.. మున్సిపల్ కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): శ్రీకాకుళం డయేరియా కేసులు పెరగడంపై ఆందోళన వ్యక్తమైంది. ఒకేసారి 76 మంది ఆస్పత్రి పాలవ్వడం, వారిలో ఎనిమిదిమంది వెంటిలేటర్ పై ఉండగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా రియాక్టైంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో డయేరియా ప్రబలడం వెనుక మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా గుర్తించారు. దీంతో శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ గా ఉన్న కూర్మారావుపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఉన్నతాధికారుల నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

# రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద అవినీతి

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రూ. 30,000 లంచం తీసుకున్నాడనే ఆరోపణలతో ప్రభుత్వ అధికారి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా కుప్పలు తెప్పలుగా నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఆ డబ్బులను చూసిన విజిలెన్స్ అధికారులకు కళ్లు చెదిరిపోయేలా ఏ బ్యాగ్ ఓపెన్ చేసిన నోట్ల కట్టలే కనిపించాయి. వాటిని లెక్కించడానికి నిన్నటి నుంచి అధికారులు శ్రమిస్తుండగా.. ఒడిశా విజిలెన్స్ విభాగం చరిత్రలోనే అత్యంత భారీ మొత్తంలో అవినీతి సొమ్ము పట్టుబడినట్లు అధికారులు ప్రకటించారు.

వివరాల్లోకి వెళితే.. కటక్ గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేబబ్రత మొహంతి రూ. 30,000 లంచం తీసుకున్నాడని ఆరోపణలు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన ఒడిశా విజిలెన్స్ అధికారులు అతని నివాసంలో తనిఖీలు చేపట్టారు. అయితే, అక్కడ లభించిన నోట్ల కట్టలను చూసి సాక్షాత్తు అధికారులే విస్తుపోయారు. దేబబ్రత ఇంట్లో ఇప్పటివరకు సుమారు రూ. 4 కోట్ల అక్రమ నగదును విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

సోదాల సమయంలో దొరికిన నగదు ఇంకా లెక్కింపు దశలోనే ఉందని, ఆ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఒడిశా విజిలెన్స్ చరిత్ర లో ఒక ప్రభుత్వ అధికారి నుండి ఇంత భారీ స్థాయిలో నగదును స్వాధీనం చేసుకోవడం రాష్ట్ర చరిత్రలోనే ఇదే మొదటిసారి అని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం దేబబ్రత మొహంతిని అదుపులోకి తీసుకున్న అధికారులు, ఆయనకు ఉన్న ఇతర ఆస్తులు మరియు అక్రమ సంపాదన మూలాలపై లోతైన దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

# చిన్నారి పునర్విక దాతలకు అలర్ట్

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కర్నూలు జిల్లాకు చెందిన చిన్నారి పునర్విక ను రక్షించేందుకు యావత్ మానవ సమాజం ఏకమైంది. సోషల్ మీడియా వేదికగా అనేక మంది చిన్నారి చికిత్స కోసం విరాళాలు సేకరించటం ప్రారంభించారు. పేద కుటుంబానికి చెందిన చిన్నారిని కాపాడాలనే సోషల్ మీడియా ప్రయత్నం విజయవంతంగా ముగిసింది. అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ వ్యాధితో బాధపడుతున్న పునర్వికకు అత్యంత ఖరీదైన 16 కోట్ల విలువైన జోల్జెన్స్‌మా ఇంజెక్షన్ అవసరమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోషల్ మీడియా వేదికగా జరిగిన ప్రచారానికి వేలాది మంది దాతలు స్పందించారు. కేవలం కొద్ది రోజుల్లోనే చికిత్సకు కావాల్సిన పూర్తి మొత్తం సమకూరింది. దీంతో ఇకపై దాతలు ఎవరు పునర్విక ఖాతాకు డబ్బులు పంపవద్దని పాప తండ్రి కోరారు.

అవసరమైన నిధులు అందడంతో చిన్నారి తండ్రి ఒక కృతజ్ఞతా వీడియోను విడుదల చేశారు. "మా పాప ప్రాణాలను కాపాడేందుకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. మీ దాతృత్వంతో 16 కోట్లు సమకూరాయి, ఇకపై ఎవరూ విరాళాలు పంపవద్దు" అని ఆయన విజ్ఞప్తి చేశారు. మానవత్వం చాటుకున్న దాతలకు నెటిజన్లు నీరాజనాలు పలుకుతున్నారు. త్వరలోనే చిన్నారికి ఈ ఇంజెక్షన్ ఇచ్చి ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం: నారాలోకేష్

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం అని మంత్రి నారాలోకేష్ అసెంబ్లీలో చెప్పారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, ఒకే అభివృద్ధి వికేంద్రీకరణ ఇదే మా నినాదం అని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ అనే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 క్లస్టర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి జిల్లాల్లో ఓ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్ ఉందన్నారు. ఎంవోయూలు కుదిరిన 770 ప్రాజెక్టులు జీఓఎమ్ ట్రాక్ చేస్తోందన్నారు.

20 నెలల్లో ప్రభుత్వం 15,87 జాబ్ ఫెయిర్ లు నిర్వహించిందని తెలిపారు. 11,373 కంపెనీలు జాబ్ ఫెయిర్ లో పాల్గొన్నాయని చెప్పారు. లక్షా 8వేల 748మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. రాయలసీమలోని అనంతపూర్ లో ఆటోమోటివ్ క్లస్టర్, కడప మరియు చిత్తూరులో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ క్లస్టర్, ఉత్తరాంధ్రలో ఫార్మ మెడికల్ డివైజెస్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇలా క్లస్టర్లు ఏర్పాటు చేసి అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తున్నామని చెప్పారు.

# అఖిలేష్ యాదవ్ బిగ్ ప్లాన్



న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): త్వరలో దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో కీలక ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల తర్వాత దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో 2027 ప్రారంభంలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం అన్ని పార్టీలు ఇప్పటికే ఎత్తులు.. పైఎత్తులు వేస్తున్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు యోగి ప్రభుత్వం నడుస్తోంది. ఈ సారైనా అధికారం చేజిక్కించుకోవాలని అఖిలేష్ యాదవ్, మాయావతి ప్రణాళికలు రచిస్తున్నారు.

ఈ క్రమంలో ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ బారీ స్కెచ్ వేశారు. ఈసారి ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్న ఆలోచనతో ఉన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం స్టాలిన్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సూచన మేరకు ఐ-ప్యాక్‌తో అఖిలేష్ యాదవ్ ఒప్పందం కుదుర్చుకున్నారు.

పార్టీ ప్రచారాన్ని జిల్లా, బూత్ స్థాయిలో తీసుకెళ్లేందుకు ఐ-ప్యాక్‌ను నియమించుకున్నట్లుగా అఖిలేష్ యాదవ్ తెలిపారు. ఐ-ప్యాక్‌ను నియమించుకోవాలని స్టాలిన్, మమతా బెనర్జీ సలహా ఇచ్చారని చెప్పారు. ఇక ఐ-ప్యాక్ సూచన మేరకు మార్చి 28న ఎన్నికల సమర శంఖారావం పూరించాలని నిర్ణయం తీసుకున్నారు. నోయిడా ర్యాలీతో అఖిలేష్ యాదవ్ ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రజలను కలవనున్నారు.

ఐ-ప్యాక్... ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ. ఈ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎస్పీ జాతీయ ఉపాధ్యక్షుడు కిరోన్మోయ్ నందా వెల్లడించారు. ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐ-ప్యాక్) ను ప్రశాంత్ కిషోర్ స్థాపించారు. ప్రస్తుతం దీనికి ప్రతీక్ జైన్ నాయకత్వం వహిస్తున్నారు. కీలక వ్యూహకర్తగా.. నాయకుడిగా పనిచేస్తున్నారు. ఇక 2022 అసెంబ్లీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ 111 సీట్లు గెలుచుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 37 సీట్లు గెలుచుకుంది.

# తెలంగాణ పల్లెల్లో ఇంటర్నెట్ విప్లవం
# టీ-ఫైబర్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

ఈ నిధులతో భారత్‌నెట్ ఫేజ్-1, ఫేజ్-2 పనులను అప్‌గ్రేడ్ చేయడంతోపాటు ఫేజ్-3 విస్తరణ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టు అమలుకు కేంద్రం, రాష్ట్రం మధ్య ఒప్పందం కుదుర్చు కోవాల్సి ఉన్నది. మరికొద్ది రోజుల్లో కేంద్ర బృందం రాష్ట్రానికి వచ్చి దీనిపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిసింది. దాంతో ఓ రూట్ మ్యాప్ రూపొందించి.. ఆ తర్వాత కేంద్రం వాటా, రాష్ట్ర వాటాను విభజించి ఒప్పందం చేసుకోనున్నారు. ఆ తదుపరి వెంటనే ఎంవోయూలు కుదుర్చుకోనున్నారు. ఆ తర్వాత కేంద్రం వాటాతో రాష్ట్రం ముందుకెళ్లనుంది.

టీ-ఫైబర్ సేవలను ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని 3,089 గ్రామాలకూ విస్తరించనున్నారు. ప్రస్తుతం టీ-ఫైబర్ ద్వారా తెలంగాణలో 9,662 గ్రామాలకు సేవలు అందించే సామర్థ్యం ఉన్నది. కొత్త గ్రామాలు చేరడంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్నెట్ అందించే దిశగా తెలంగాణ మరో అడుగు ముందుకేస్తుంది. మొత్తం రూ. 3,185 కోట్లలో రూ. 2,697 కోట్లు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నెట్ కేబుల్ పనులు, నిర్వహణ కోసం వినియోగించనున్నారు.

మరో రూ. 432 కోట్లు ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో కేబుల్ మౌలిక వసతుల బలోపేతానికి కేటాయించనున్నారు. భారత్‌నెట్ ఫేజ్-2లో ఇప్పటికే టీ-ఫైబర్ ద్వారా సుమారు 42 వేల కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ కేబుల్ 9,662 గ్రామాల్లో వేశారు. వీటిలో 8,835 గ్రామాల్లో సేవలు ప్రారంభించేందుకు సాంకేతికంగా సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే సేవలు ప్రారంభం కానున్నాయి.

గ్రామ జనాభా ఆధారంగా ఇంటింటికీ ఇంటర్నెట్ కనెక్షన్ ఖర్చును కూడా నిర్ణయించారు. 3,000 మందికి పైగా జనాభా ఉన్న గ్రామాల్లో ఒక కనెక్షన్‌కు రూ. 8,900, 2,000--3,000 మధ్య జనాభా ఉన్న గ్రామాల్లో రూ. 10,500, 1,000-2,000 మధ్య జనాభా ఉన్న గ్రామాల్లో రూ. 11,500, 1,000 కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో రూ. 12,900గా నిర్ణయించారు. ఈ ఆమోదం రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా లభించింది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుంది. మంత్రి శ్రీధర్‌బాబు కేంద్రంతో చర్చలు జరిపి ప్రాజెక్టు ఆమోదం కోసం కృషి చేశారు. ఈ క్రమంలో కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సమావేశమై టీ-ఫైబర్ విస్తరణకు సహకారం కోరారు. ఈ ప్రాజెక్టు అమలుతో గ్రామాల్లో డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ విద్య, టెలీమెడిసిన్, ఈ-గవర్నెన్స్ మరియు గ్రామీణ వ్యాపార అవకాశాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి.

ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు గ్రామాల్లో ఎలాంటి అంతరాయం లేకుండా టీ-ఫైబర్ సేవలందిస్తోంది. అయితే.. కేంద్రంతో ఒప్పందం తర్వాత మొదటగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పూర్తి స్థాయిలో సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. లేదంటే ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో అమలు చేయాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే.. ఆ రెండు జిల్లాల్లో పోల్చితే కరీంనగర్‌లోనే సోర్స్ ఎక్కువ అనే అభిప్రాయం అధికారుల్లో వ్యక్తం అయినట్లు తెలిసింది. అందులో భాగంగానే ఇక్కడే ముందుగా ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారని సమాచారం.

# పీఎం ఆవాస్ యోజన 2.0 జోరు
# పట్టణ పేదలకు రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం

మొదటి పేజీ తరువాయి

ఈ పథకాన్ని ప్రధానంగా రెండు విభాగాల్లో అమలు చేస్తున్నారు. లబ్ధిదారులే స్వయంగా తమ స్థలంలో ఇల్లు నిర్మించుకునే 'బెనిఫిషియరీ లెడ్ కన్స్ట్రక్షన్' (బిఎల్సీ) పద్ధతితో పాటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మించే 'అఫోర్డబుల్ హౌసింగ్ ఇన్ పార్టనర్‌షిప్' (ఏఎచ్పి) ద్వారా ఈ గృహాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో ఉంటూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈ డబ్ల్యూఎస్), అల్ప ఆదాయ వర్గాలకు (ఎల్ఐజి) ఈ పథకం ఒక గొప్ప వరమని కేంద్రం పేర్కొంది. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు గృహప్రవేశం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం సమన్వయం చేసుకుంటోంది.

అర్హత ప్రమాణాలు

ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే దరఖాస్తుదారుడి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షల నుంచి రూ. 9 లక్షల లోపు ఉండాలి. దేశంలో ఎక్కడా లబ్ధిదారుడికి, వారి కుటుంబ సభ్యులకు సొంత పక్కా ఇల్లు ఉండకూడదు. ముఖ్యంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, సీనియర్ సిటిజన్లకు ఈ పథకంలో ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తారు. ఇంటి యాజమాన్యం తప్పనిసరిగా మహిళ పేరు మీద- పురుషుడితో కలిపి ఉమ్మడి పేరు మీద ఉండాలి.

దరఖాస్తు విధానం

పైన తెలిపిన అన్ని అర్హతలు ఉన్న వారు ఆన్‌లైన్‌లో https://pmay-urban.gov.in/ వెబ్‌సైట్ ద్వారా, నేరుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ, బ్యాంకు పాస్‌బుక్ కాపీని సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అర్హులైన వారికి రూ. 2.50 లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తారు.

# రెండునెలల పసిగుడ్డు ఏం చేసిందని చంపేశారు? : కేటీఆర్ ధ్వజం

ఈ ఘటనలో పోలీసులు బాధిత కుటుంబానికి అండగా నిలవకపోవడం హేయమైన చర్య అన్నారు. హంతకులను కాపాడేందుకు పోలీసులు ప్రయత్నించడం ఆ వ్యవస్థకే సిగ్గుచేటని విమర్శించారు. మనం ఎంత అభివృద్ధి చెందిన సమాజంలో ఉన్నా.. నేటికీ కులంపేరుతో దాడులు చేస్తుండటం దారుణమన్నారు. ఆ రెండేళ్ల చిన్నారికి కులం తెలుసా ? మతం తెలుసా? ఏం తెలుసని నిండు జీవితాన్ని చిదిమేశారంటూ ఫైరయ్యారు. హంతకుడు ఏ పార్టీకి చెందినవాడైనా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, చిన్నారి మరణానికి కారణమైన 8 మందినీ వెంటనే అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఎప్‌స్టీన్ వివాదం.. తప్పు ఒప్పుకున్న బిల్‌గేట్స్.. కానీ!

మొదటి పేజీ తరువాయి



అయితే, ఆ మహిళలకు ఎప్‌స్టీన్ సాగిస్తున్న అక్రమ దందాలతో ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. మైనర్లపై అక్రమ వేధింపుల కేసులో ఎప్‌స్టీన్ దోషిగా తేలిన తర్వాత కూడా (2011లో) అతడితో కలవడం తాను చేసిన పెద్ద తప్పని గేట్స్ విచారం వ్యక్తం చేశారు. అతడి నేపథ్యాన్ని సరిగ్గా తెలుసుకోకుండానే చర్చలు జరిపానని, ఆ సమయంలో తన ఫౌండేషన్ సభ్యులను కూడా అతడి దగ్గరకు తీసుకెళ్లడం పెద్ద పొరపాటని ఈ ఇంటర్వ్యూలో ఆయన ఒప్పుకున్నారు. ఎప్‌స్టీన్‌తో భేటీ అయిన మాట వాస్తవమే అయినా, తాను ఎలాంటి చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడలేదని బిల్‌గేట్స్ స్పష్టం చేశారు. ఎప్‌స్టీన్ అసిస్టెంట్లు తనతో ఫోటోలు దిగారని, కానీ వారితో తనకు ఎలాంటి పరిచయం లేదని చెప్పారు. తన మాజీ భార్య మెలిందా గేట్స్, ఎప్‌స్టీన్ విషయంలో మొదటి నుంచీ అనుమానంగానే ఉన్నారని ఆయన తెలిపారు. ఆమె ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ, తాను అతడితో పరిచయాన్ని కొనసాగించానని, అది తన తప్పేనని ఆయన అంగీకరించారు. అమెరికా న్యాయశాఖ ఇటీవల ఎప్‌స్టీన్ కేసులో దాదాపు 30 లక్షల పేజీల దర్యాప్తు పత్రాలను విడుదల చేసింది. ఇందులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖుల పేర్లు బయటకు వచ్చాయి. ఆ జాబితాలో తన పేరు ఉండటంతో బిల్‌గేట్స్ తాజాగా వివరణ ఇచ్చారు.

## బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని సూసైడ్ కేసులో ట్విస్ట్

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ సెకండియర్ చదువుతోన్న వసంత (19) అనే విద్యార్థిని బాలికల హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. వసంత ఆత్మహత్యకు చదువుల ఒత్తిడి కారణమా? లేక కుటుంబ సమస్యలా? తోటి విద్యార్థులంతా ఆందోళన చెందుతున్న సమయంలో పోలీసులు కొత్త విషయం చెప్పడంతో విద్యార్థుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆత్మహత్యకు సరైన కారణమేంటో చెప్పాలని డిమాండ్ చేస్తూ వీసీ ఛాంబర్ ను ముట్టడించారు. దీంతో కళాశాల ఆవరణలో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. వసంత ఆత్మహత్య కేసులో పోలీసులు అనుమానించిన కోణమేంటి?

వసంత ఆత్మహత్య కేసులో పోలీసులు సంచలన విషయాలను బయటపెట్టినట్లు తెలుస్తోంది. గణేష్ అనే యువకుడితో వసంత ఐదేళ్లుగా ప్రేమలో ఉన్నట్లు సమాచారం. మంగళవారం రాత్రి గణేష్ నుంచి ఫోన్ కాల్ రాగా.. ఆ తర్వాత ఆమె మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తర్వాత ఫోన్ కాల్స్, వాట్సప్ బ్లాక్ చేసినట్లు గుర్తించారు. ట్విస్ట్ ఏంటంటే.. గణేష్ నిన్న రాత్రే హైదరాబాద్ లోని ఓ హాస్టల్ లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గణేష్ ఆత్మహత్య విషయం తెలుసుకున్న వసంత.. నిన్న రాత్రే కత్తితో చేతికి, మెడకు గాట్లు పెట్టుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆ తర్వాత యమున గర్ల్స్ హాస్టల్లో తన గదిలో ఉరివేసుకుని చనిపోయినట్లు తెలిపారు. అయితే విద్యార్థులు మాత్రం.. వసంత ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆమె చేతులు, మెడపై గాయాలుండటంతో ఏం జరిగిందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు, వీసీ మాత్రం వసంత మనోవేదనతోనే చనిపోయినట్లు చెప్తున్నారు. కాగా.. గణేష్ చివరిగా చేసిన ఫోన్ కాల్ లో గణేష్ ఏం చెప్పాడు? ప్రేమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడమే కారణమా? బంధువులే అయినా ఎందుకు దూరం పెట్టాలనుకున్నారు? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భారత్ - పాక్ అణుయుద్ధంపై ట్రంప్ సంచలనం

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): భారత్ - పాకిస్థాన్ దేశాల మధ్య అణుయుద్ధం జరగకుండా ఆపింది తానేనంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టేట్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. భారత్ - పాకిస్థాన్ల మధ్య యుద్ధమేఘాలను తాను తొలగించానని, తాను జోక్యం చేసుకోకపోయి ఉంటే ఇరుదేశాల మధ్య పెద్ద యుద్ధం సంభవించేదన్నారు. ఈ యుద్ధం జరిగి ఉంటే కనీసం 3.5 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయేవారని, పాకిస్థాన్ ప్రధాని కూడా చనిపోయేవారని ట్రంప్ పేర్కొన్నారు. తన దౌత్యంతోనే పెనుప్రమాదం తప్పిందని ట్రంప్ చెప్పడం సంచలనంగా మారింది. తొలి 10 నెలల కాలంలోనే 8 యుద్ధాలను ఆపానని పేర్కొన్నారు.

గతేడాది మే నెలలో పహల్గాం ఉగ్రదాడి తర్వాత.. భారత్ - పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఆ సమయంలోనే తాను రంగంలోకి దిగి.. గొడవలు ఆపకుంటే ఎలాంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోనని ఇరుదేశాల నేతలకు తేల్చి చెప్పానన్నారు. యుద్ధం ఆపకుంటే 200 శాతం టారిఫ్ లు విధిస్తానని హెచ్చరించడంతో ఇరుదేశాలు శాంతించాయని వివరించారు. కొద్దినెలలుగా ట్రంప్ ఈ విషయాన్ని సుమారు 80 సార్లు ప్రస్తావించారు. తన మధ్యవర్తిత్వంతోనే భారత్ - పాక్ ల మధ్య యుద్ధం ఆగిందన్నారు. యుద్ధ విమానాలు కూల్చివేతపై కూడా భిన్నమైన గణాంకాలను చెబుతూ వస్తున్నారు. అయితే, ట్రంప్ వాదనలను భారత్ (న్యూఢిల్లీ) మొదటి నుంచీ తోసిపుచ్చుతూనే ఉంది. మే 10న కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా భారత్-పాక్ దేశాల మధ్య నేరుగా జరిగిన చర్చల ఫలితమేనని, ఇందులో మూడో పక్షం జోక్యం ఏమాత్రం లేదని భారత విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది.

# యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఇటీవల వరుసగా కాంట్రవర్సీల్లో నిలుస్తున్న యూట్యూబర్ అన్వేష్‌కు పోలీసులు బిగ్ షాక్ ఇచ్చారు. అన్వేష్‌పై పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. నటి కరాటే కల్యాణి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ చర్యలు తీసుకున్నారు. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కల్యాణి గతంలో అన్వేష్‌పై కంప్లైట్ ఇవ్వగా పంజాగుట్ట పీఎస్‌లో కేసు నమోదైంది. అయితే ఇటీవల అన్వేష్ అకౌంట్‌ను ఇన్ స్టాగ్రామ్ బ్లాక్ చేసింది. తర్వాత తనకు రెండు ఇన్ స్టాగ్రామ్ అకౌంట్లు రెండు, యూట్యూబ్ చానల్స్ ఉన్నాయని అన్వేష్ వీడియోను విడుదల చేశారు. ఆ సందర్భంలో అతడు అసభ్యకరమైన పదజాలాన్ని వాడాడు. ఈ విషయంలోనూ ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్?కు కూడా పంజాగుట్ట పోలీసులు లేఖ రాయబోతున్నట్లు తెలుస్తోంది. తాజా పరిణామంతో నా అన్వేష్ అరెస్ట్ కావడం ఖాయమా అనే చర్చ జరుగుతోంది.

రెడ్ కార్నర్ నోటీసులు కోరుతాం: అన్వేష్ కు పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు ఇవ్వడంపై స్పందించిన కరాటే కల్యాణీ ఇంతటితో ఆగబోమని రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతామన్నారు. దేవీ దేవతలను దూషించడంతో పాటు భారతదేశ పాస్ పోర్టును, దేశ రాజముద్రను అవహేళన చేసేలా మాట్లాడి రాజద్రోహం చేశాడని అన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని పోలీసులు నోటీసులు ఇచ్చారన్నారు. విర్రవీగడం, మిడిసి పోవడం మనిషికి పనిచేయదన్నారు.

## పెళ్లి పీటలపైనే వధువును తుపాకీతో కాల్చిన ప్రియుడు

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బిహార్‌లో దారుణం చోటు చేసుకుంది. పెళ్లి పీటలపైనే ప్రియురాలిని ప్రియుడు తుపాకీతో కాల్చాడు. ఈ ఘటన బక్సర్ ప్రాంతంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. బక్సర్‌లో మంగళవారం రాత్రి వివాహ వేడుక జరిగింది. ఈ వేడుకలో వధువు, వరుడు స్టేజిపై ఉన్న సమయంలో ఆమె ప్రియుడు దీన్ బంధు వచ్చి తుపాకీతో కాల్చాడు. దీంతో 18 సవంత్సరాల ఆర్తి కుమారి అక్కడికక్కడే కుప్పకూలింది.

వధూవరుల చుట్టూ వారి బంధువులు, స్నేహితులు ఉన్న సమయంలోనే ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోలో.. వధువు సోదరి తమ వరుడి నుదిటిన బొట్టు పెట్టి ఆర్తి వైపు తిరుతున్న సమయంలో వేదికపై గుమిగూడినవారిలో ఒక వ్యక్తి ఆర్తి పొట్టలో తుపాకీతో కాల్చాడు. బుల్లెట్ ఆమె కడుపులోకి దూసుకువెళ్లడంతో అక్కడే కుప్పకూలింది.

వెంటనే స్టేజిపై ఉన్నవాళ్లంతా అక్కడ నుండి పరుగులు తీశారు. కుటుంబ సభ్యులు, బంధువులు బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. మొదట స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యుల సలహా మేరకు అక్కడ నుండి వారణాసి ట్రామా సెంటర్‌కు తరలించారు. వధువు పరిస్థితి ఇంకా విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. నింధితుడు గతంలో జైలుకు వెళ్లి వచ్చాడని పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం పరారీలో ఉండటంతో అతడి కోసం గాలిస్తున్నారు.

# ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని.. ఫిక్స్...!

న్యూస్ డెస్క్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఒకే రాష్ట్రమని.. ఒకే రాజధాని అని తాము ఫిక్స్ అయ్యామని, అదే నినాదంతో ఎన్నికలకు వెళ్లామని, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే చెప్పామని మంత్రి నారా లోకేశ్ అని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ఏపీ కేపిటల్ పై స్పష్టత ఇచ్చారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 22 చోట్ల కస్టర్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలో ఆటోమోటివ్ క్లస్టర్డ్, కర్నూలు జిల్లాలో రెన్యూవబుల్ ఎనర్జీ, సిమెంట్ క్లస్టర్డ్, కడప, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్ మేనిప్యాక్చర్ క్లస్టర్డ్, నెల్లూరులో గ్లాస్, ఏసీ క్లస్టర్డ్, ప్రకాశం జిల్లాలో కంప్రెస్ బయోగ్లాస్, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్, ఆక్వా క్లస్టర్డ్‌ను తీసుకొస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

కాగా గత ప్రభుత్వం మూడు రాజధానుల నినాదంతో పాలన కొనసాగించిన విషయం తెలిసిందే. అయితే ఈ విధానంపై తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చింది. 2024లో జరిగిన ఎన్నికల్లో ఘోరంగా 11 సీట్లకు మించి గెలవలేకపోయింది. దీంతో అసెంబ్లీ ప్రతిపక్ష హోదా సైతం దక్కలేదు. కానీ ఒకే రాష్ట్రం అనే నినాదంతో ఎన్నికలకు వెళ్లిన కూటమికి 164 సీట్లతో పట్టం కట్టారు. మళ్లీ ఇన్ని రోజుల తర్వాత అసెంబ్లీ వేదికగా రాష్ట్ర రాజధాని అంశంపై చర్చించారు. ఈ మేరకు నారా లోకేశ్ స్పష్టత ఇచ్చారు.

KR TV క్రాంతి తెలంగాణ epaper.krtvnews.com

## ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్



సూర్యాపేట, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక, పరీక్షలకు సంబంధించి సూర్యాపేట జిల్లా కేంద్రంలో,నారాయణ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కలశాల పరీక్షా కేంద్రాలను ఎస్పి నరసింహ ఐపీఎస్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, పరీక్షా సరళిని పరిశీలించి విధులు నిర్వహిస్తున్న ఎగ్జామినేషన్ సెంటర్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి సూచనలు సలహాలు, అందించారు. పరీక్షా కేంద్రాల వద్ద నేషేద ఆజ్ఞలు 144 సెక్షన్ అమలు చేస్తున్నామని తెలిపినారు. పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. నిషేధ ఆజ్ఞలు ఉన్నందున పరీక్ష కేంద్ర పరిసరాల్లో లౌడ్ స్పీకర్లు, మైకులు, వాహన హరన్ లు ఉపయోగించరాదని కోరారు, జిరాక్స్ సెంటర్స్, ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.ఎస్పి వెంట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఎస్ఐ లు శివ తేజ, మహేంద్రనాధ్, ఎగ్జామినేషన్ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థుల తడబాటు..!

### పొరపాటున తప్పుడు పరీక్షా కేంద్రానికి
### సాయం అందించిన పోలీస్ కానిస్టేబుల్
### మరో ఇద్దరికి హెల్ప్ చేసిన స్థానికులు



వికారాబాద్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఇంటర్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తొలి రోజు తడబాటుకు గురయ్యారు. ఓ ముగ్గురు విద్యార్థులు హడావుడిలో పొరపాటున తప్పుడు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. అప్పటికే సమయం దగ్గర పడుతుండడంతో ఆందోళనకు గురయ్యారు. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ బలరాం, మరో వ్యక్తి వారిని బైకుపై ఎక్కించుకుని వారికి కేటాయించిన పరీక్షా కేంద్రానికి తరలించారు. ఈ సంఘటన తాండూరు పట్టణంలో చోటు చేసుకుంది. బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటలకు పరీక్షలు జరుగుతుండగా అరగంట ముందుగా పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ రోడ్డు మార్గంలోని మైనార్టీ గురుకుల కాలేజీతో పాటు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోని సోషల్ వెల్ఫేర్ కాలేజీలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మైనార్టీ గురుకుల కాలేజీ వద్దకు ముగ్గురు విద్యార్థినిలు వచ్చారు. అయితే వారి హాల్ టిక్కెట్ పై సోషల్ వెల్ఫేర్ కాలేజీ సెంటర్ పేరు ఉంది. అప్పటికే సమయం దగ్గర పడుతుండడంతో ఆందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న ఓ కానిస్టేబుల్ విద్యార్థిలను బైకుపై సోషల్ వెల్ఫేర్ కాలేజీ సెంటర్కు తీసుకవెళ్లి సాయం అందించారు. మరో ఇద్దరిని స్థానికులు కూడా బైకుపై తీసుకవెళ్లి పరీక్షా కేంద్రం వద్ద దిగబెట్టారు. దీంతో విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## అన్నార్తులను ఆదుకున్న ఆప్త బంధువు



సూర్యాపేట/మద్దిరాల, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ముకుందాపురము, గ్రామము లో ఎంతో దీన స్థితిలో, తమ జీవితాన్ని గడుపుతున్న కొన్ని కుటుంబాలకు, ఆప్త బంధువు గా నిలిచిన, ఎస్ఐ సంధ్య సుభాన్. ముకుందాపురం గ్రామానికి చెందిన కంది నారాయణ కుమార్తె ఉపేంద్ర కు నెలలకు సరిపడ ఆహార వస్తువులను అందించారు. అలాగే అదే గ్రామంలో ఇటీవల మరణించిన, మీసాల నర్సయ్య కుమారుడు వెంకన్న కుటుంబానికి, కొంత ఆర్థిక సహాయము అందించి, కొన్ని నిత్యావసర వస్తువులు అందించారు. భర్తని కోల్పోయి అత్యంత దీన స్థితిలో, తమ జీవితాన్ని గడుపుతున్న ఆలకుంట్ల బాలమ్మ, ఎల్లమ్మ కు రెండు నెలలకు సరిపడ ఆహార వస్తువులను, అందచేయడం జరిగింది. మనసున్న వారే నిజమైన మహానుభావులు అనిపించుకున్నారు. మంచి మనసు సాటుకున్న సంధ్య సుభా ను గ్రామ ప్రజలు అభినందించారు. ఇంకా ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేస్తారని ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరియు యువత తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్న అమానుష ఘటనపై తీవ్ర ఖండన

### - సి.పి. ఎం మండల కార్యదర్శి ఉడుగుల లింగన్న



తొర్రూరు, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): 78 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో కూడా కుల అహంకారం, అధికార దుర్వినియోగం, సామాజిక అన్యాయం ఇంకా కొనసాగుతుండటం అత్యంత విషాదకరం. నాగర్ కర్నూల్ జిల్లాలో చాకలి (రజక) సమాజానికి చెందిన కేవలం 2 నెలల అమాయక శిశువును కాలితో తన్నడం వలన ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన మన సమాజంలోని అసమానతలు, దౌర్జన్య పాలన, కుల ఆధిపత్య రాజకీయాల క్రూర రూపాన్ని బహిర్గతం చేస్తోంది. ఈ ఘటనలో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రెడ్డి సర్పంచ్ మరియు అతని అనుచరులను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్రమైన అనుమానాలు కలిగిస్తోంది. సంఘటన జరిగి వారం రోజులు గడిచినా కూడా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధిత కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని మరింత పెంచుతోంది. ఇది సాధారణ క్రిమినల్ కేసు మాత్రమే కాదు, ఇది సామాజిక న్యాయానికి, రాజ్యాంగ విలువలకు సవాలు విసిరిన ఘటన,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే ఇటువంటి దారుణ ఘటన జరిగి, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం గుడ్డి దద్దమ్మ పాలనకు నిదర్శనంగా నిలుస్తోంది. రాజ్యాంగం సమానత్వం హామీ ఇస్తే, నేలమీద మాత్రం పేదలు, దళితులు, బలహీన వర్గాలపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉండటం పాలకుల వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతోంది. ఈ ఘటన కేవలం ఒక కుటుంబం పట్ల జరిగిన అన్యాయం మాత్రమే కాదు; ఇది కుల ఆధిపత్య సామాజిక నిర్మాణం ఇంకా గ్రామీణ సమాజంలో ఎంత బలంగా ఉందో తెలియజేసే ఘోర ఉదాహరణ. అధికారంలో ఉన్నవారికి చట్టాలు వర్తించవు, పేదలకు మాత్రం వెంటనే వర్తిస్తాయి అన్న భావన ప్రజల్లో బలపడేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. చట్టం ముందు అందరూ సమానమని చెప్పే ప్రభుత్వాలు, ప్రభావశీలుల విషయంలో మాత్రం మౌనం పాటించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. పాలక వర్గాలు న్యాయాన్ని ఆలస్యం చేయడం అంటే న్యాయాన్ని నిరాకరించడం అనే విషయాన్ని గుర్తించాలి. ఒక అమాయక శిశువు ప్రాణం కోల్పోయిన ఘటనపై వెంటనే స్పందించాల్సిన ప్రభుత్వం రాజకీయ లెక్కలు వేసుకుంటూ మౌనంగా ఉండటం అత్యంత దారుణం. బాధిత కుటుంబానికి రక్షణ, న్యాయం, పరిహారం అందించడంలో విఫలమైతే ప్రజల ఆగ్రహం సహజమే. సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న మాట్లాడుతూ -- నిందితులైన సర్పంచ్ మరియు అతని అనుచరులను వెంటనే అరెస్టు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని, ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిర్ర యాకన్న, ఎస్.కే. సాజన్, శ్రీనివాస్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా మొదలైన ఇంటర్మీడియట్ పరీక్షలు




మహబూబాబాద్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బుధవారం రోజున జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగాయని ఇంటర్మీడియట్ విద్యాధికారి సిహెచ్ .మదార్ గౌడ్ తెలిపారు. జిల్లా మొత్తం మీద మొదటి సంవత్సరం విద్యార్థులు 18 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్ష రాశారు. మరిపెడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను అడిషనల్ కలెక్టర్ లెనిన్ వాత వత్సల్ టోప్పో సందర్శించారు. పరీక్ష తీరును సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ మరియు జిల్లా పరీక్షా అధికారులు తనిఖీ చేశారు. జిల్లా లో ఇంటర్ పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య 3317,హాజరు అయిన విద్యార్థులు 3237,ఆబ్సెంట్ అయిన విద్యార్థులు 80మంది, ఒకేషనల్ లో 1042మంది విద్యార్థులలో 955మంది ప్రెసెంట్,87మంది ఆబ్సెంట్ అయ్యారు మొత్తం గా జిల్లాలో ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థుల సంఖ్య 4359,ప్రెసెంట్4192, ఆబ్సెంట్ 167మంది విద్యార్థులు, అని మదర్ గౌడ్ తెలిపారు.

## కారు డ్రైవ్ చేసే వారు సీటు బెల్టు పెట్టుకొని డ్రైవ్ చేయండి



చెన్నారావుపేట, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో కారు తోలే ప్రతి ఒక్కరూ సీటు బెల్టు పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని పూల బొకేలు ఇస్తూ అవగాహన కల్పిస్తున్న పోలీసులు. ఈ సందర్భంగా చెన్నారావుపేట ఎస్సై జి రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డుపై డ్రైవింగ్ చేసేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవడం వలన జరగకూడని ప్రమాదాలు జరిగిన ప్రాణాప్రాయం నుండి బయటపడటం జరుగుతుందని కావున ప్రతి ఒక్కరు సీటు బెల్టు పెట్టుకొని డ్రైవ్ చేసి రోడ్లపై సురక్షితమైన ప్రయాణం చేసి జాగ్రత్తగా ఇల్లు చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారు డ్రైవర్స్, ఓనర్లు మరియు ప్రయాణికులు జమీదార్ ఇస్తారు పాల్గొన్నారు.


## మన్నే సుధాకర్ దశదినకర్మలో పాల్గొన్న టీఎన్జీవోస్ నాయకులు



ఖమ్మం, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఆర్టీవో ఆఫీస్ లో పనిచేస్తూ, ఇటీవల అకాల మృతి చెందిన మన్నే సుధాకర్ దశ, దినఖర్మ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించి తన ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతున్ని ప్రార్థించిన, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి జడ్.ఎస్ జయపాల్, జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లూరి శ్రీకాంత్ మరియు టిఎన్జీవోస్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

### జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



మహబూబాబాద్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలనీ, జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ జ్ఞాన సంపదకు విజ్ఞాన కేంద్రాలుగా, భవితకు బంగారు బాట వేసే నిధి గ్రంథాలయాలు మాత్రమే. విజ్ఞాన భాండాగారాలుగా పేరొందిన గ్రంథాలయాలతో భవితకు బంగారు బాటలు వేసుకోవచ్చు ,ఉన్నంత శిఖరాలు అధిరోహించవచ్చు, ఉన్నంత లక్ష్యాలు సాధించవచ్చు. కాబట్టి జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు వసూలు చేసిన గ్రంథాలయ పన్ను ఎప్పటికప్పుడు చెల్లించి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి దోహదపడాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టీ శ్రీలత, జిల్లా పౌర సంబంధాల అధికారి రాజేంద్రప్రసాద్, తొర్రూరు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, మరిపెడ మున్సిపల్ కమిషనర్ విజయ్ ఆనంద్, డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ నిరంజన్, రెవిన్యూ ఆఫీసర్ రఘు,, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, కేసముద్రం మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ ఆకుల కిషోర్, డిపిఓ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ విక్రమ్, రుద్రారపు వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## లోన్ కట్టలేదని వేధిస్తే కఠిన చర్యలు తప్పవు



వరంగల్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): లోన్ కట్టలేదని రుణ గ్రహీతలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని సుప్రీంకోర్టు హెచ్చరించింది. బ్యాంకులు లేదా ఫైనాన్స్ యాప్‌లనుంచి అప్పు తీసుకున్న వారు వాయిదాలు ఆలస్యం చేస్తే,రికవరీ కి ఏజెంట్లు ఇంటికి వచ్చి గొడవ చేయడం,ఫోన్లలో బూతులుతిట్టడం, బంధువులకు ఫోన్ చేసి పరువుతీయడం వంటి చర్యలు చేయడం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది.భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి వ్యక్తికి వ్యక్తిగతస్వేచ్ఛ హక్కు ఉందని,రికవరీ ఏజెంట్లు వేధిస్తే అది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అవుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది.అలాగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ఇండియా ఫెయిర్ ప్రాక్టీసెస్ కోడ్ ప్రకారం ఉదయం 8 గంటల ముందు లేదా రాత్రి 7 గంటల తర్వాత కాల్ చేయకూడదని,అనుమతి లేకుండా ఇంటికి రావద్దని స్పష్టం చేసింది. ఏజెంట్లు బూతులు తిట్టితే భారతీయ న్యాయ సంహిత చట్టం,2023 సెక్షన్296 కింద,బెదిరింపులు చేస్తే సెక్షన్ 351(క్రిమినల్ ఇంటిమిడేషన్)కింద కేసులు నమోదు చేయవచ్చని కోర్టు తెలిపింది.బ్యాంకులు రికవరీ ప్రక్రియను అవుట్‌సోర్స్ చేసినా, ఏజెంట్ల అక్రమాలకు బ్యాంకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.అవసరమైతే సంబంధిత బ్యాంక్ లైసెన్స్‌ను రద్దు చేసే అధికారం ఆర్‌బీఐకి ఉందని హెచ్చరించింది. శాంతి ప్రసాద్ వర్సెస్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సివిల్ అప్పీల్ నం.1045/2026,తేదీ 3 ఫిబ్రవరి 2026) కేసులో ఇచ్చిన తీర్పులో, రికవరీ ఏజెంట్లు బాధితుడి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తే అది ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా పేర్కొంది.వేధింపులకు గురైన పిటిషనర్‌కు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని బ్యాంక్‌ను ఆదేశించింది.అప్పుతీసుకోవడం నేరం కాదని,అది ఒక ఒప్పందం మాత్రమేనని కోర్టు పేర్కొంది. రికవరీ ప్రక్రియ చట్టబద్ధంగా జరగాలి తప్ప భయపెట్టి లేదా బెదిరించి వసూలు చేయడం చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈతీర్పుతో దేశవ్యాప్తంగా రుణగ్రహీతలకు భారీ ఊరట లభించనుంది.





# భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం : వైఎస్ జగన్



ఏపీ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పులివెందుల వేంపల్లె మండలం నందిపల్లిలోని నందీశ్వర ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవంలో బుధవారం వైసీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాల్లో సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొని, స్వామివారికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనం స్వీకరించారు.

ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకలని, భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుందని తెలిపారు.

నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డిని, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# హైకోర్టు సీరియస్.. ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం




ఏపీ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో 2018 గ్రూప్–1 పరీక్షల ఆధారంగా జరిగిన అధికారుల బదిలీలపై హైకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్, 2018 గ్రూప్–1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని విచారణ పూర్తయ్యే వరకు, ఎంపికైన అధికారులందరిని అప్రాధాన్య పోస్టుల్లో ఉంచాలని ఆదేశించింది. ముఖ్యంగా ప్రాధాన్య పోస్టుల్లో ఉన్న 26 మంది అధికారులను కు అటాచ్ చేసే ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టు సూచించింది.

ఈ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది.. కుప్పం ఆర్డిఓ సహా రాష్ట్రంలోని ఇతర ఆర్డిఓలను బదిలీ చేయడం.. ఎంపికైన అధికారుల ప్రాధాన్యతని సమీక్షించి, అవసరమైతే అప్రాధాన్య పోస్టులో నియమించడం చేసింది.. 2018 కి చెందిన గ్రూప్ 1 అధికారును బదిలీ చేసింది.. హైకోర్టు ఆదేశాలతో ప్రాధాన్య పోస్టుల్లో ఉన్న 26 మందిని జిఏడి కి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది సర్కారు.. కుప్పం ఆర్ డీ ఓ తో సహా రాష్ట్రంలోకి కీలక డివిజన్ ల ఆర్డిఓ లను బదిలీ చేసింది. ప్రభుత్వం...ఇదే అంశంపై ఏపీ సీఎస్ పై హై కోర్ట్ ఇప్పటికే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.. కోర్ట్ చెప్పినా ఎందుకు ప్రాధాన్య పోస్ట్ ల్లో ఉంచారని సీఎస్ ను ప్రశ్నించింది. దీంతో... సీఎస్ ఆదేశాలతో జీఏడీకి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది ప్రభుత్వం.


హైకోర్టు, ఆదేశాలు పాటించని కారణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)ను పిలిచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రేపు ఉదయాన్నే సిఎస్ హైకోర్టులో హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి.. ఆ దేశానికి సత్ఫలితంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంది.. హైకోర్టు ఆదేశాలు మరియు ప్రభుత్వ నిర్ణయాల నేపథ్యంలో 2018 గ్రూప్–1 అధికారుల బదిలీ వ్యవహారం అత్యంత పర్యవేక్షణలో ఉంది.

# అతనో ప్రభుత్వ ఉద్యోగి.. డ్యూటీ దిగిన తర్వాత దొంగతనాలు..!



ఏపీ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పేరుకు అతనో ప్రభుత్వ ఉద్యోగి.. కానీ, డ్యూటీ దిగిన తర్వాత దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కాడు.. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం చిక్కుళ్లగూడెంలో జరిగిన చోరీ కేసును ఛేదించారు పోలీసులు.. ఈ చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడైన వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగి అని తెలిసి అంతా షాక్ తిన్నారు.. వృద్ధురాలైన ఉప్పు అనసూయ మెడలో 40 గ్రాముల బంగారు చైన్ ఎత్తుకెళ్లాడు నంద సుభాష్ అనే వ్యక్తి.. ఈ కేసులో నిందితుడైన నంద సుభాష్.. విజయవాడకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి (అసిస్టెంట్ లైన్‌మన్)గా గుర్తించారు.. అదేవిధంగా దొంగతనానికి ఉపయోగించిన బైక్ గానుగపాడు గ్రామంలో కొట్టేసినట్టు తేల్చారు.. ఉద్యోగం చేస్తూ చెడు వ్యసనాలకు బానిసైన నంద సుభాష్.. దొంగతనాలకు పాల్పడుతున్నట్టు పోలీసులు చెబుతున్నారు.. నిందితుడిని లక్ష్మీపురం శివారులో అరెస్టు చేసినట్లు మీడియాకు తెలిపారు సీఐ కే.గిరిబాబు.. ఈ సమావేశంలో ఎస్సై రాజు, ఐడి పార్టీ కానిస్టేబుల్ షేక్ ఖాసిం పాల్గొన్నారు.. అయితే, నంద సుభాష్‌ను అరెస్ట్ చేయడంతో పాటు.. అతన వద్ద నుంచి బంగారంతో పాటు బైక్ ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

# జిమ్‌లో గుండెపోటుతో యువకుడు మృతి



ఏపీ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుంది.. ఫుడ్ మారుస్తున్నారు.. ఉదయమే వాకింగ్, జాకింగ్.. వర్కౌట్స్ ఇలా.. వారి వీలును బట్టి సమయానికి కేటాయిస్తున్నారు.. మరోవైపు గుండెపోటు మరణాలు మాత్రం ఆగడం లేదు.. చిన్నా.. పెద్ద తేడా లేకుండా ఎంతో మంది ప్రాణాలు విడుస్తున్నారు.. తాజాగా, చిత్తూరు జిల్లా పలమనేరులోని జిమ్ సెంటర్‌లో ఒక యువకుడు గుండెపోటుతో మృతి చెందడం స్థానికంగా సంచలనం సృష్టించింది. పలమనేరు పాతవపేటకు చెందిన విశ్వనాథ్, ఉదయం జిమ్‌కి వెళ్లి వ్యాయామం చేస్తున్న సమయంలో తీవ్రమైన అస్వస్థతకు గురయ్యాడు.. కొద్దిసేపటి తర్వాత జిమ్ బయటకు వచ్చి వాంతులు చేసిన అనంతరం, అతను మృతి చెందాడు.

అయితే, జిమ్‌లో సరైన ట్రైనింగ్ ఇవ్వకపోవడం, రికవరీ సమయంలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వలన ఈ ఘటన జరిగినట్లు విశ్వనాథ్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు, ఆయన మృతి గుండెపోటు కారణంగా జరిగిందని ధృవపరిచారు. కాగా, విశ్వనాథ్ డీసీసీ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. యువకుడి ఆకస్మిక మృతి స్థానికంగా విషాదాన్ని నింపింది.. అయితే, జిమ్‌లో వ్యాయామం చేసే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చూస్తున్నారు.. ముఖ్యంగా సరైన వ్యాయామ పథకాన్ని అనుసరించడం.. తగిన వైద్య పర్యవేక్షణ ఉండటం.. శారీరక పరిస్థితిని గమనించడం.. ఎటువంటి అసౌకర్యం కనిపిస్తే వెంటనే విశ్రాంతి తీసుకోవడం.. ఈ విధమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గుండె సంబంధిత

# వీఎస్‌ఆర్ ఏవియేషన్స్‌తో ఎలాంటి లావాదేవీలు లేవు..ఒక కప్పు కాఫీ కూడా తాగలేదు



ఏపీ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ లాబీలో మంత్రి నారా లోకేష్ మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడుతూ.. వీఎస్‌ఆర్ ఏవియేషన్స్ తో ఎలాంటి లావాదేవీలు లేవని తేల్చి చెప్పారు. కానీసం వాళ్లతో కలిసి ఒక కప్పు కాఫీ కూడా తాగలేదని తేల్చి చెప్పారు. వాళ్ళు మా దగ్గర 2022లో ఫైనాన్స్ తీసుకున్నారు.. ఆ రోజుకి మేము అధికారంలోకి వస్తామని కానీ, మా ఎంపీ ఏవియేషన్ మినిస్టర్ అవుతారని గానీ, అజిత్ పవార్ హెలికాప్టర్ లో ఎక్కుతారని కానీ కల వచ్చిందా.. మేము ఏమైనా జ్యోతిష్యులామా అని పేర్కొన్నారు. ఇక, జగన్ చెప్పిన దానికి మేమెందుకు సమాధానం చెప్పాలి.. క్లారిటీ ఇవ్వాల్సిన ప్రశ్నకి సమాధానం ఇవ్వాలి కదా.. తప్పకుండ ఇస్తాము.. నోట్ కూడా విడుదల చేస్తాని లోకేష్ చెప్పారు.


ఇక, బొత్స సత్యనారాయణ చిల్లర దొంగలని పట్టుకుని గజ దొంగలని వదిలేస్తున్నారని అన్నారని నారా లోకేష్ గుర్తు చేశారు. జగన్ గజ దొంగనా.. జగన్ ని పట్టుకోవాలని అన్నాడా.. మేము అదే చెప్తున్నాం.. సిట్ విచారణలో తేలింది ఇదే కదా.. మా మీద 6కి పైగా కేసులు పెట్టారు.. స్కిల్, ఫైబర్ నెట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, అసైన్డ్ భూములు, ఇసుక, లిక్కర్ కేసు లు పెట్టి వేధించారు.. ఛార్జ్ షీట్ దాఖలు చేసినప్పుడు కంపిటేంట్ అథారిటీ నుంచి ఆమోదం పొందాలి.. మంత్రులకైతే గవర్నర్.. ఎమ్మెల్యేల కైతే స్పీకర్ దగ్గర పర్మిషన్ తీసుకోవాలి అన్నారు. ఫామ్ 19 ప్రకారం ఎందుకు ఇవ్వలేదు.. ఆ కేసులపై ఆధారాలు ఉంటే గవర్నర్ కి ఎందుకు చూపలేదు.. ఒక్క ఆధారమైన చూపించారా అని లోకేష్ ప్రశ్నించాడు.

# టీటీడీ పేరుతో నకిలీ వెబ్ సైట్లు...భక్తులకు బిగ్ అలర్ట్



ఏపీ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తిరుమల లో నకిలీ వెబ్ సైట్లు కలకలం సృష్టించాయి. దర్శన టికెట్లు, గదుల కేటాయింపుల పేరుతో భక్తుల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. దీంతో టీటీడీ అప్రమత్తమైంది. టీటీడీని పోలిన నకిలీ వెబ్ సైట్లను గుర్తించింది. గతంలోనూ 40 నకిలీ వెబ్ సైట్లపై పోలీసులకు అధికారులు ఫిర్యాదు చేశారు. అయినా సరే మళ్లీ నకిలీ వెబ్‌సైట్లు చెలరేగిపోయాయి. దీంతో ఈ నకిలీ వెబ్ సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని భక్తులకు టీటీడీ అధికారులు సూచించారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారానే భక్తులు సేవా టికెట్లు పొందాలని స్పష్టం చేశారు. భక్తులను మోసం చేస్తున్న నకిలీ వెబ్‌సైట్ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది.

# ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు.. ప్రాణాలు పోయేవరకు పోరాటం చేస్తా




ఏపీ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): : నా ఇంటిపై సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన దాడి అర్ధరాత్రి 12 గంటల వరకు అంటే దాదాపుగా 7 గంటల పాటు జరిగిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. బొత్స సత్యనారాయణ, రాష్ట్ర డీజీపీ, డీఐజీ, ఎస్పీలకు అనేకసార్లు ఫోన్ చేసిన ఎవరు ఫోన్ ఎత్తలేదు.. ఒక్కరు కాకపోయినా ఒక్కరు కూడా మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్సీల ఫోన్లు ఎత్తలేదు.. అసలు క్రిమినల్స్ దాడికి వచ్చిన వాళ్ళు కాదు.. డీజీపీ ఒక క్రిమినల్, ఎస్పీ క్రిమినల్, ఐజీ, చంద్రబాబు, లోకేష్ క్రిమినల్స్.. రక్షణ ఇవ్వాల్సిన పోలీసులు ఫోన్లు ఎత్తలేదు అంటే కూటమి పాలనలో ప్రజాస్వామ్యం ఎక్కడ ఉందో అర్థ చెసుకొవచ్చని అంబటి పేర్కొన్నారు.

అయితే, మా ఇంటిపై దాడి జరిగే సమయంలో ముందు, గంజాయి సరఫరా చేశారని అంటి రాంబాబు ఆరోపించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఫెయిల్ అయింది.. మాజీ మంత్రి ఇంటిపై ఏకధాటిగా 7 గంటలకు పైగా దాడి జరిగితే పోలీసులు నిద్రపోయారా.. మా ఇంటి దగ్గరకు వచ్చిన ఎస్పీ తిరిగి వెనక్కి వెళ్ళాడు.. ఇంకా మాకు పనులు ఉండవా అంటూ ఎస్పి మాట్లాడటం బాధాకరం.. చంద్రబాబుకి టచ్ లో ఉండే పనిలో ఉన్నారా ఎస్పీ.. ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు.. ప్రాణాలు పోయేంత వరకు పోరాటం చేస్తాని తెలిపారు. దాడులు చేసే వారికి పోలీసుల రక్షణగా ఉంటే ఏం చేయాలని క్వశ్చన్ చేశారు. కూటమి పాలనలో వ్యవస్థలు ఏ విధంగా తయారవుతున్నాయో రాష్ట్ర ప్రజలు గమనించాలని కోరారు. అన్నిటికీ సమాధానం చెప్పే రోజు ఒకటి వస్తుందని మాజీ మంత్రి రాంబాబు వెల్లడించారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యత లేదు



ఏపీ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): : శ్రీకాకుళం జిల్లాలో డయేరియా బాధిత ప్రాంతాల్లో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 నెలలుగా టీడీపీ పాలనలో ప్రజారోగ్యం నిర్లక్ష్యం చేశారు.. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు శాపంలా మారాయి.. ప్రతి జిల్లాకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఇవ్వాలనుకున్నాం.. ప్రైవేటీకరణతో ఒక ప్రభుత్వ ఆలోచనలు తొక్కేశారు.. కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యత లేదన్నారు. బలగ ప్రాంతంలో డయేరియా డిసెంబర్ లో ఇలానే వచ్చింది.. 100 మందికి పైగా డయేరియా పేషెంట్లు ఉన్నారు.. మంచి ప్రభుత్వం అని స్టిక్కర్లు అంటించుకుంటారు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోరంటూ మాజీ మంత్రి ధర్మాన ప్రసాద్ రావు మడిపడ్డారు.

అయితే, అతిసారంతో నలుగురు చనిపోతే ఒకరు లేదా ఇద్దరే చనిపోయారంటున్నారు.. వాంతులు, విరోచనాలతో ప్రజలు చనిపోతుంటే పోస్టుమార్టం అంటున్నారని మాజీ మంత్రి ధర్మాన ప్రసాద్ రావు పేర్కొన్నారు. కుటుంబాలను ఆదుకుందామనే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదన్నారు. బాధ్యత లేకుండా రాజధాని పేరుతో డబ్బును ఒకే దగ్గర పెడుతున్నారని విమర్శించారు. అన్ని రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నారు.. యూరియా బస్తా కోసం రైతు వెళ్తే యూరియా బస్తా లేదు.. ఇంగ్లీషు మీడియం చదువుకుంటాననే విద్యార్థికి విద్య లేదు.. ధాన్యానికి కనీస మద్దతు ధర లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం రెండు కేజీ లు ఎక్కువ తీసుకుంటున్న పట్టించుకోలేదని ప్రసాద్ రావు చెప్పారు.

ఇక, నదుల్లో సిల్ట్ క్లియర్ చేయాల్సిన ప్రాంతాల్లో కాకుండా వేరే ప్రాంతాల్లో తీస్తున్నారని మాజీ మంత్రి ధర్మాన అన్నారు. దోపిడి, నిర్లక్ష్యంతో పాలన చేస్తున్నారని విమర్శించారు. మున్సిపాలిటీని ప్రైవేట్ ఏజెన్సీల తయారు చేశారు.. ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్ని ప్రాంతాల ప్రజల్లో వచ్చింది.. ఇచ్చిన హామీల కోసం రూ. 1000 కోట్ల అయినా శ్రీకాకుళంలో ఖర్చు చేశారా అని క్వశ్చన్ చేశారు. ప్రజాస్వామ్యంలో మిమ్మల్ని బొందా పెట్టే రోజు దగ్గర లోనే ఉందని ప్రసాద్ రావు వెల్లడించారు.

# అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



ఏపీ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన రాజుపాలెం మండలం ఉప్పలపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మల్లేశ్వరి(45) అనే మహిళ తన ఇంటి సమీపంలో తీవ్ర గాయాలతో మృతి చెందారు. ఒంటిపై ఉన్న గాయాలను గమనిస్తే ఆమెను ఎవరో హత్య చేసి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై మణికృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. డాగ్ స్క్వాడ్ బృందాన్ని పిలిపించి చుట్టుపక్కల ప్రాంతాన్ని విచారించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టానికి తరలించారు. ఘటన స్థలంలో ఆధారాలు సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు మల్లేశ్వరికి ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్సీ ని మర్యాదపూర్వకంగా కలిసిన శివకుమార్




కుత్బుల్లాపూర్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన దుండిగల్ సర్కిల్ బహదూర్పల్లి బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు శివ యాదవ్, పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, ను శంబిపూర్ కృష్ణ, ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ గ్రంధాలయ చైర్మన్ నాగరాజ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ ఎలగారి సత్యనారాయణ యాదవ్, మాజీ సర్పంచ్ కొమురయ్య, సత్యనారాయణ యాదవ్, కుమార్ యాదవ్, కృష్ణ యాదవ్, నరసింహ యాదవ్, యాదయ్య యాదవ్, కొమురయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీను యాదవ్, నరేష్ యాదవ్, హోటల్ రాము, తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో లిమిటేషన్ సంఖ్యలో స్కానింగ్‌లు

### చేసేది ఏమీ లేక ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్న రోగులు

సూర్యాపేట, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో లిమిటేషన్ సంఖ్యలో స్కానింగ్ లు.రోజుకు 40 లోపు మాత్రమే స్కానింగ్లు తీస్తున్నారు.మిగతా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమని అడిగితే, తెల్లవారి రావాల్సిందే అంటున్న సంబంధిత సిబ్బంది. చేసేది ఏమీ లేక ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్న,రోగులు ఇదే అదును చేసుకొని అందిన కాడికి ఇదే అదును చేసుకొని, అందిన కాడికి సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, దీనికంతటికీ కారణం స్కానింగ్ సెంటర్ల (హెచ్వోడీస్) హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ మానిటరింగ్,లేక సీనియర్ రెసిడెన్స్ డాక్టర్స్ మీదనే పని భారం పడుతుంది.దాని వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీలైతే రేడియాలజీ డిపార్ట్మెంట్లో క్రొత్త, డాక్టర్లని రిక్రూట్ చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు మరో విషయం ఏమిటంటే,మధ్యాహ్నం 12 దాటితే ఒక రెడీయాలజిస్ట్ కూడా స్కాన్ చేయట్లేదు అని తెలిసింది. తిరిగి తెల్లారి ఉదయం 10:30 గంటలకి స్టార్ట్ చేస్తున్నారు. ఒక రెండు గంటలు మాత్రమే, రెడీయాలజిస్ట్ పనిచేసే పరిస్థితి కనపడుతుంది. అత్యవసర సమయాలలో స్కానింగ్ అవసరం ఉంటే ప్రైవేట్ ఆసుపత్రి ఆశ్రయించవలసిన పరిస్థితి. ఇక్కడ ఐదుగురు డాక్టర్లు ఉన్నప్పటికీ స్కానింగ్ సౌకర్యాలు సరిగా అందట్లేదు,జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రోగులకు ఇలాంటి సమస్యలు రాకుండా,ఆర్థిక భారం పడకుండా,ప్రధాన ఆరోగ్య సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇదే విషయంపై, ఇంతకు ముందు




ప్రత్యేక కథనం వెలువరించిన, పట్టించుకోని అధికారులు.

## కోరిన కోర్కెలు నెరవేర్చే కొంగుబంగారం మల్లన్న: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





కుత్బుల్లాపూర్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జిహెచ్ఎంసి దుండిగల్ సర్కిల్ పరిధి బహదూర్ పల్లి లోనీ శ్రీ కొమురెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించిన జాతర కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ముఖ్యఅతిథిగా హాజరై మల్లన్న స్వామి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీరుస్తూ భక్తుల పాలిటా కొంగుబంగారంగా నిలుస్తున్న మల్లన్నకు గ్రామాల అభివృద్ధి, పంటల సౌభాగ్యం, కుటుంబ సుఖశాంతుల కోసం భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటూ తరతరాలుగా భక్తులు చేసే పూజలే జాతర అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మన్నే రాజు, మాజీ కౌన్సిలర్ ఎలాగరి సత్యనారాయణ, సగ్గిడి పద్మారావు, శ్యామ్, ఆలయ కమిటీ సభ్యులు శివా యాదవ్, మాజీ సర్పంచ్ కొమురయ్య యాదవ్, బాల్ రాజ్ యాదవ్, సత్యనారాయణ యాదవ్, మల్లేష్ యాదవ్, కుమార్ యాదవ్, కృష్ణ యాదవ్, సాధు యాదవ్, నరేష్ యాదవ్, యాదయ్య యాదవ్, నరసింహ యాదవ్, నరసింహ యాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీను యాదవ్, నరేష్ యాదవ్, హోటల్ రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూములపై చర్యలు పూర్తిగా చట్టబద్ధం

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### రూ. 250 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి రక్షణ

### వెలుగుమట్ల భూదాన్ భూములపై పత్రికా ప్రకటన విడుదల



ఖమ్మం, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వెలుగుమట్ల గ్రామ సర్వే నం.147, 148, 149 లోని భూదాన్ భూములపై జిల్లా యంత్రాంగం చేపట్టిన కూల్చివేతలు, స్వాధీనం చర్యలు పూర్తిగా చట్టబద్ధమైన వని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 ఎకరాల 7 గుంటల భూదాన్ భూమి ఆక్రమణలో ఉండగా, సంబంధిత భూమి మొత్తం విలువ సుమారు 250 కోట్లకు పైగా ఉంటుందని, భూదాన్ బోర్డు భూమిని సి.సి.ఎల్.ఏ, హై కోర్ట్ ఆదేశాల మేరకు ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకోవడం ద్వారా భారీ స్థాయిలో ఆస్తిని రక్షించగలిగామని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 24 నాడు నిర్వహించిన కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు దానిని తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. భూదాన్ యజ్ఞ బోర్డు, రెవెన్యూ శాఖ సమగ్ర విచారణలో నకిలీ పత్రాలు, అక్రమ కేటాయింపులు వెలుగు చూశాయని, ఇప్పటికే పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. హైకోర్టు స్టే ఉన్న నిర్మాణాలను మినహాయించి మిగిలిన భూమిని ప్రభుత్వం స్వాధీనం లోకి తీసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిని భవిష్యత్ ప్రజా అవసరాలకు ఉపయోగిస్తామని, ఇండ్లు కోల్పోయిన వారిలో అర్హులైన స్థానిక పేదలకు ప్రభుత్వం తగు విధంగా న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## ప్రభుత్వ ఆస్తిని దోచుకుంటే సహించం

### గిరిజన గౌరవం కాపాడటానికి చివరివరకు పోరాటం

### సర్పంచ్ బానోతు రాఘవేంద్ర



గీసుకొండ, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కెనాల్ నుండి అక్రమ మట్టి (మొరం) తవ్వకం మరియు పోలీసుల అధికార దుర్వినియోగంపై సూర్య తండా గ్రామపంచాయతీ సర్పంచ్ గిరిజన లంబాడ నాయకుడు బానోతు రాఘవేంద్ర జిల్లా కలెక్టర్ ని మరియు సిటీ పోలీస్ కమిషనర్ ని కలిసి సమగ్ర ఫిర్యాదు పత్రాన్ని సమర్పించారు. 24-02-2026న ఎస్సారెస్పీ కెనాల్ పరిధిలో 10కు పైగా ట్రాక్టర్లు, ఒక జెసిబి సహాయంతో అక్రమంగా మట్టి తవ్వి తరలించిన ఘటన వెలుగులోకి వచ్చింది. అయితే అక్కడ ఉన్న అన్ని వాహనాలపై చర్యలు తీసుకోకుండా కేవలం మూడు ట్రాక్టర్లపైనే కేసులు నమోదు చేయడం స్పష్టమైన సెలెక్టివ్ ఎన్ఫోర్స్మెంట్ అని ఆరోపించారు. ప్రజాప్రతినిధిగా ప్రశ్నించినందుకు తనపై అవమానకర పదజాలంతో బెదిరింపులు చేశారని, గిరిజన సామాజిక కార్యకర్తను ఫోన్ ద్వారా బెదిరించి అనంతరం ప్రజల సమక్షంలో పోలీస్ వాహనంలో తీసుకెళ్లారని తెలిపారు. ఇది గిరిజన ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించిన చర్య అని పేర్కొన్నారు. ఫిర్యాదులో భాగంగా 24-02-2026 ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సంబంధిత సీఐ మరియు సిబ్బంది చేసిన ఫోన్ కాల్స్‌కు సంబంధించిన కాల్ డీటెయిల్ రికార్డ్స్ సీజ్ చేసి విశ్లేషించాలని, పోలీస్ జీప్ జిపిఎస్ డేటా, స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్, సంఘటన ఫోటోలు, వీడియోలు మరియు సోషల్ మీడియా ఆధారాలను సీజ్ చేసి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్రమంగా మట్టి తరలించిన కాంట్రాక్టర్ లేదా సంబంధిత వ్యక్తులపై పూర్తి స్థాయి పెనాల్టీ విధించి, ప్రభుత్వానికి చెందాల్సిన పన్నులు, మరియు నష్టపరిహారం మొత్తాన్ని కఠినంగా వసూలు చేయాలని స్పష్టంగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాస్తవ్యులు లావుడియా రాజన్న, భూక్యా రాము తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

## ప్రగతి నగర్ వైకుంఠధామాన్ని పునరుద్ధరణ పనులను చెప్పట్టిన పరిరక్షణ కమిటీ




కుత్బుల్లాపూర్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): 276 డివిజన్ ప్రగతి నగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలేటి శ్రీనివాస్ రావు సహకారంతో ప్రగతి నగర్ వైకుంఠధామాన్ని పునరుద్ధరణ పనులను చెప్పట్టిన పరిరక్షణ కమిటీ సభ్యులు ఆలేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీల కతీతంగా వైకుంఠధామంలో బోర్ రిఫ్రెషింగ్, న్యూ మోటార్,పూల మొక్కలు, ల్యాండ్ స్కేప్ ప్లాంటేషన్, గ్రీన్ బెల్ట్, నందన వనంలా తీర్చిదిద్ద డానికి ల్యాండ్ స్కేప్ ప్లాంటేషన్ వాళ్లకు మన వైకుంఠ ధామాన్ని డెవలప్మెంట్ కు ఇవ్వడం జరిగినది ఒక నెల వ్యవదిలో వారు వైకుంఠదామాన్ని కంప్లీట్ చేసి వాడుకలోకి తేనున్నారు అని తెలియ జేస్తున్నాము ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పరిరక్షణ కమిటీ కన్వీనర్ చల్లా సుధీర్ రెడ్డి, ఇంద్రజిత్ , ఆలేటి శ్రీనివాసరావు , అరవింద్ నాయుడు, రాములు నాయక్,రవీందరరెడ్డి, తులసిదాస్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులో బీట్లు బంద్..!

### ఈ నామ్ కొత్త రూల్‌పై వ్యాపారుల నిరసన

### మార్కెట్ అధికారులకు అసోసియేన్ వినతి

### తాండూరులో నిలిచిపోయిన కొనుగోళ్లు




వికారాబాద్/తాండూర్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తాండూరు మార్కెట్ యార్డులో బుధవారం బీట్లు బంద్ అయ్యాయి. వ్యాపారులు కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంతో దీనికి సంబంధించిన కార్యకలాపాలు నిలిచిపోయాయి.తాండూరు మార్కెట్ కమిటిలో ఈ నామ్ వ్యవస్థ ద్వారా క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మార్కెట్ కమిటి అధికారులు వ్యాపారుల ద్వారా రైతులకు సంబంధించిన ఆధార్ కార్డు, చిరునామ, సెల్ నెంబర్ వంటి వివరాలు ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. దీనిపై వ్యాపారులు నిరసకు దిగారు. గతంలోనే మార్కెట్ కమిటి కార్యదర్శి సమక్షంలోనే రైతులకు సంబంధించిన ఆధార్ కార్డు, వివరాలు తాము ఇవ్వలేమని తెలిపినట్లు వ్యాపారులు గుర్తుచేస్తున్నారు. తాజాగా బుధవారం ది గ్రేన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు మరోసారి వ్యాపారులు సర్వసభ్య సమావేశం నిర్వహించి.. ఈ నామ్ కొత్త రూల్‌పై చర్చించుకున్నారు. ఇందులో కూడా రైతులకు సంబంధించిన ఆధార్ కార్డు, ఇతర వివరాలు అధికారులకు ఇవ్వడం కష్టమని తెలిపారు. ఇదే విషయంపై తాండూరు మార్కెట్ కమిటి సూపర్ వైజర్ హబీబ్ అల్వికి వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా ఈ నామ్‌లో భాగంగా లాట్ ఐడీ, గేట్ ఎంట్రీ తప్పక చేయాలని, రైతులు సరుకులు తెచ్చినప్పుడు రైతులను అడాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ తరువాతే సరుకుల గ్రేడ్ చేయించాలని, టెండర్ అయిన తరువాత ప్రతి దుకాణంలో దడువైలతో తూకాలు చేయించాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెంకట రాములు గౌడ్, ప్రధాన కార్యదర్శి పటేల్ కిరణ్ కుమార్, మాజీ అధ్యక్షులు బంటారం సుధాకర్, కట్కం వీరేందర్, అధికారులు ఎలాంటి లావాదేవిలు జరపకపోవడంతో తాండూరు మార్కెట్ కమిటిలో కొనుగోళ్ల బీట్లు జరగలేదు.

## క్యాన్సర్‌పై భయాందోళనలు వద్దు..!

### వ్యాధి నివారణకు ఆధునికి చికిత్సలు

### యశోధ ఆసుపత్రి వైద్యులు డా.సచిన్ మర్ధా

### తాండూరులో ఐయామ్ అన్ స్టాపబుల్ పుస్తకావిష్కరణ




వికారాబాద్/తాండూర్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): నేటి ఆధునిక సమాజంలో కూడా క్యాన్సర్ వ్యాధి అంటే అందరు భయాందోళనకు గురవుతున్నారని, ఈ వ్యాధిపై ఉన్న అపోహలను అందరు వీడనాడాలని హైదరాబాద్ యశోధ ఆసుపత్రి వైద్యులు డా.సచిన్ మర్ధా అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డా. సచిన్ మర్ధా మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. నేటి ఆహారపు అలవాట్లతో పాటు ఇతర కారణాల వల్ల క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. క్యాన్సర్ వ్యాధిని నాలుగు దశల్లో గుర్తించవచ్చని అన్నారు. మొదటి దశలోనే గుర్తిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆ తరువాత దశలలో కిమో థెరపీ, రేడియేషన్ తదితర పద్ధతులతో నయం చేయవచ్చని అన్నారు. ప్రస్తుతం ఆధునిక పద్ధతులతో చికిత్స అందించే సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. రోబోటిక్ చికిత్స ద్వారా క్యాన్సర్‌ను నయం చేయవచ్చని తెలిపారు. అదేవిధంగా ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు. అదేవిధంగా యశోధ ఆసుపత్రి ప్రతినిధి పరమేష్ మాట్లాడతూ హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోధ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధికి చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆదునిక చికిత్సలు అందించడంతో దేశంలోనే రెండో ఆసుపత్రిగా యశోధ ఆసుపత్రి నిలిచిందని అన్నారు. పేదలకు ఇన్సురెన్స్, కంపెనీల బీమాలతో క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందించడం జరుగుతుందని, క్యాన్సర్ వ్యాధి చికిత్సలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం యశోధ ఆసుపత్రి వైద్యులు డా.సచిన్ మర్ధ రెండేళ్ల పాటు శ్రమించి రాసిన ఐయామ్ అన్ స్టాపబుల్ అనే పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్వాడి యువమంచ్ సభ్యులు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## బానోత్ లక్ష్మణ్ దశదిన కర్మలో నివాళులర్పించిన బహుజన నాయకులు



ఖమ్మం/రఘునాథపాలెం, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఖమ్మం నగరానికి చెందిన బానోత్ భీమ్లా నాయక్ సోదరుడు బానోత్ లక్ష్మణ్, ఇటీవల అకాల మరణం చెందారు. బుధవారం రఘునాథపాలెం సమీపంలో ఉన్న గణేష్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో, దశదిన కర్మను కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బహుజన నాయకులు భద్రు నాయక్, దాసరి శ్రీనివాస్, బుడిపుటి రాము, సంఘమేశ్వరావు, జమ్మి వీరబాబు, పాలపాటి మిన్ను, బిందె రమేష్, చింతపల్లి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా మృతుని చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

# చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే ఈ ఆహారాలను రోజూ తీసుకోవాలి..!

హెల్త్ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కొల్లాజెన్ అనేది మానవ శరీరంలో అత్యధికంగా ఉండే ఒక ముఖ్యమైన నిర్మాణ ప్రోటీన్. చర్మం, ఎముకలు, స్నాయువులు, మృదులాస్థి, రక్తనాళాలకు బలం, సాగే గుణాన్ని, నిర్మాణ మద్దతును అందించడంలో ఇది ఎంతో సహాయపడుతుంది. గ్లైసిన్, ప్రోలిన్, హైడ్రాక్సీప్రోలిన్ వంటి అమైనో ఆమ్లాలతో తయారవుతుంది. చర్మాన్ని యవ్వనంగా కనిపించేలా చేయడంలో, కీళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, ఎముకలను బలంగా తయారు చేయడంలో, గాయాలు త్వరగా మానడంలో కొల్లాజెన్ కీలక పాత్ర పోషిస్తుంది. చాలా మంది యవ్వనంగా కనిపించడానికి, చర్మంపై ముడతలు రాకుండా ఉండడానికి కొల్లాజెన్ సప్లిమెంట్స్ ను ఉపయోగిస్తూ ఉంటారు. అలాగే వయసు పైబడే కొద్ది కొల్లాజెన్ ఉత్పత్తి కూడా తగ్గుతూ ఉంటుంది. అయితే సప్లిమెంట్స్ పై ఆధారపడే అవసరం లేకుండా సహజంగా లభించే ఆహారాల ద్వారా కూడా కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచకోవచ్చు. కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచే చిట్కాల గురించి, సహజ ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



విటమిన్ సి ఉండే ఆహారాలు..

విటమిన్ సి ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం ద్వారా కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుకోవచ్చు. సిట్రస్ పండ్లు, ఉసిరి, బెర్రీలు, కివి, బెల్ పెప్పర్ వంటి పండ్లను తీసుకోవడం వల్ల అమైనో యాసిడ్లు కొల్లాజెన్ గా మారతాయి. వాతావరణ కాలుష్యం, ఎండ కారణంగా చర్మ కణాలు దెబ్బతినకుండా కాపాడడంలో కొల్లాజెన్ ఎంతో సహాయపడుతుంది. గుడ్లు, ధాన్యాలు, పాల ఉత్పత్తులు, చేపలు, లీన్ ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం ద్వారా కొల్లాజెన్ ఉత్పత్తిని సహజంగా పెంచుకోవచ్చు. అలాగే జింక్, రాగి వంటి ఖనిజాలు కూడా కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. గింజలు, నట్స్, హోల్ గ్రెయిన్స్, కోకోవా, సెల్‌ఫిష్ వంటి ఆహారాల్లో ఈ ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఈ ఆహారాలను తీసుకోవడం ద్వారా చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

యూవీ కిరణాలు తగలకుండా..

అంతేకాకుండా చర్మానికి ఎక్కువగా యూవీ కిరణాలు తాకడం వల్ల కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గుతుంది. కనుక బయటకు వెళ్లినప్పుడు సన్‌స్క్రీన్ వాడడం, చర్మానికి నేరుగా ఎండ తగలకుండా కప్పుకోవడం వంటివి చేయాలి. ఇక శరీరం ఎల్లప్పుడూ హైడ్రేటెడ్ గా ఉండేలా చూసుకోవాలి. నీరు కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచదు కానీ చర్మ కణాలకు పోషకాలు సరిగ్గా అందేలా చేయడంలో, కొల్లాజెన్ పనితీరును పెంచడంలో సహాయపడుతుంది. నీరు తాగడం వల్ల చర్మం మృదువుగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది. అదే విధంగా తగినంత నిద్ర కూడా కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుందని చెప్పవచ్చు. నిద్రించడం వల్ల శరీరం కొల్లాజెన్ మరమ్మత్తు చేయడంతో పాటు పునరుత్పత్తి చేస్తుంది. అంతేకాకుండా తగినంత నిద్రించడం వల్ల హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయి. ఒత్తిడి కారణంగా కొల్లాజెన్ నష్టం జరగకుండా ఉంటుంది. దీర్ఘకాలిక ఒత్తిడి కారణంగా కార్టిసాల్ హార్మోన్ ఎక్కువగా విడుదల అవుతుంది. దీంతో కొల్లాజెన్ ఉత్పత్తి నెమ్మదిస్తుంది. కనుక ఒత్తిడిని తగ్గించుకోవాలి. నడక, శ్వాస వ్యాయామాలు, యోగా వంటివి చేయాలి. ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా చర్మం, కీళ్ల కణజాలలు విచ్చినం అవ్వకుండా ఉంటాయి.

ప్రాసెస్డ్ ఫుడ్స్ వద్దు..

అధిక చక్కెరలను తీసుకోవడం వల్ల కొల్లాజెన్ ఫైబర్ లు దెబ్బతింటాయి. కనుక చక్కెర అధికంగా ఉండే ఆహారాలను, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ ను తీసుకోవడం తగ్గించాలి. దీని వల్ల అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. పొట్ట ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. పొట్ట ఆరోగ్యంగా ఉండడం వల్ల పోషకాలు ఎక్కువగా గ్రహించబడతాయి. దీంతో కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. కనుక సమతుల్య ఆహారాన్ని, కూరగాయలను, పండ్లను, పులియబెట్టిన ఆహారాలను ఎక్కువగా తీసుకునే ప్రయత్నం చేయాలి. ఈ విధంగా తగిన ఆహారాలను తీసుకుంటూ, ఒత్తిడి అదుపులో ఉండేలా చూసుకుంటూ, చక్కటి జీవనశైలిని పాటించడం వల్ల కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా చర్మం, కీళ్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# ఈ పండ్లను రోజూ తింటే మీ గుండె సేఫ్

హెల్త్ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో గుండె ఒకటి. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా అవసరం. కానీ ప్రస్తుత కాలంలో చాలా మంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. గుండెపోటు, స్ట్రోక్ ల కారణంగా ప్రాణాలను కోల్పోతున్నారు. కనుక గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ముఖ్యంగా ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్లతో నిండిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇటువంటి పోషకాలన్ని కలిగి ఉన్న ఆహారాల్లో పండ్లు కూడా ఒకటి. పండ్లను తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. గుండె ఆరోగ్యాన్ని సంరక్షించడంలో సహాయపడే పండ్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



బెర్రీలు, యాపిల్ పండ్లు..

గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో బెర్రీ జాతికి చెందిన పండ్లు ఎంతో సహాయపడతాయి. బ్లూబెర్రీ, స్ట్రాబెర్రీ, రాస్ప్బెర్రీ వంటి పండ్లు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఆంథోసైనిన్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి గుండె ప్రమాదాలను తగ్గించడంలో దోహదపడతాయి. ఈ పండ్లను తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. స్మూతీ, పెరుగు, ఓట్ మీల్ వంటి వాటితో ఈ పండ్లను కలిపి తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆపిల్ పండ్లు కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ఈ ఫైబర్ సహాయపడుతుంది. ఆపిల్స్ పాలీఫినాల్స్ ను కూడా కలిగి ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించే ప్రభావాలను కలిగి ఉంటాయి. ఆపిల్ ను తొక్కతో సహా కలిపి తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు.

అవకాడో, నారింజ పండ్లు..

అవకాడోలు మోనోశాచురేటెడ్ కొవ్వులను కలిగి ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో అవసరం. వీటిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుంది. అవకాడోలను తీసుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. హోల్ గ్రెయిన్ టోస్ట్ లతో, సలాడ్స్, స్మూతీ వంటి వాటితో అవకాడోలను కలిపి తీసుకోవచ్చు. నారింజ పండ్లు గుండె ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడతాయి. వీటిలో విటమిన్ సి, ఫైబర్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని, రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, ధమనుల ధృడత్వాన్ని తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. తాజా నారింజ పండ్ల రసాన్ని తీసుకోవడం లేదా నారింజ పండ్లను నేరుగా నమిలి తినడం వంటివి చేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

దానిమ్మ పండ్లు..

ఇక దానిమ్మ పండ్లు కూడా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతో దోహదపడతాయి. దానిమ్మ పండ్లల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ప్యూనికాలాజిన్లు ఉంటాయి. ఇవి ధమనుల్లో అడ్డంకులు ఏర్పడకుండా కాపాడడంలో, రక్తప్రవాహాన్ని మెరుగుపరచడంలో ఉపయోగపడతాయి. సలాడ్లు లేదా పెరుగు మీద దానిమ్మ గింజలను చల్లి తీసుకోవడం ద్వారా, స్వచ్ఛమైన దానిమ్మ పండ్ల రసాన్ని తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ఈ విధమైన పండ్లను రోజూ ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. తద్వారా గుండె ఆరోగ్యాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# క్రీడలు





## జింబాబ్వేపై న్యూజిలాండ్ మహిళల జట్టు ఘనవిజయం.. వన్డే సిరీస్ కివీస్ కైవసం



స్పోర్ట్స్ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): న్యూజిలాండ్ మహిళల జట్టు జింబాబ్వేతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఘన విజయం సాధించింది. ఈ పర్యటనలో వరుస విజయాలతో న్యూజిలాండ్ జట్టు (వైట్ ఫెర్న్స్) తమ ఆధిపత్యాన్ని చాటుతోంది. రెండో వన్డేలో కివీస్ మహిళలు అన్ని విభాగాల్లో రాణించి జింబాబ్వేను చిత్తు చేశారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న జింబాబ్వే, న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయింది. ఫ్రాన్ జోనాస్ అద్భుతమైన స్పెల్‌తో నాలుగు వికెట్లు తీయగా, రోజ్ మేరీ మెయిర్చ, ఇతర బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో జింబాబ్వే 122 పరుగులకే పరిమితమైంది.

అనంతరం 123 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్, ఆది నుంచే దూకుడుగా ఆడింది. స్టార్ బ్యాటర్ సుజీ బేట్స్ హాఫ్ సెంచరీతో రాణించగా, జార్జియా ప్లిమ్మర్ (41) ఆమెకు చక్కని సహకారం అందించింది. కేవలం 16.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన కివీస్ జట్టు, వన్డే సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఈ పర్యటనలో తదుపరి మ్యాచ్‌లు, టీ20 సిరీస్ కోసం న్యూజిలాండ్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది.

## శిఖర్ ధావన్‌కు బిగ్ రిలీఫ్.. పాటియాలా హౌస్ కోర్టు షాకింగ్ ఉత్తర్వులు



స్పోర్ట్స్ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీమిండియా మాజీ డ్యాషింగ్ ఓపెనర్ మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కు భారీ ఊరట లభించింది. తన మాజీ భార్య అయేషా ముఖర్జీ పై సాగిస్తున్న న్యాయ పోరాటంలో ఆయన భారీ విజయం సాధించారు. ఆస్ట్రేలియాలోని ఆస్తి సెటిల్‌మెంట్ కింద తీసుకున్న రూ.5.7 కోట్లను శిఖర్ ధావన్‌కు తిరిగి ఇచ్చేయాలని ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు అయేషాను ఆదేశించింది. ధావన్ నుంచి ఆ సెటిల్‌మెంట్ పత్రాలపై సంతకాలు తీసుకోవడానికి ఆమె బెదిరింపులు, దోపిడీ మోసపూరిత పద్ధతులు ఉపయోగించిందని కోర్టు నిర్ధారించింది. ఈ క్రమంలోనే ఆ పత్రాలన్నీ చెల్లవని న్యాయస్థానం స్పష్టం చేసింది. కేసు దాఖలు చేసిన తేదీ నుంచి చెల్లించి మొత్తంపై 9 శాతం వార్షిక వడ్డీని కూడా కలిపి చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

అదేవిధంగా గతంలో ఆస్ట్రేలియా కోర్టులు ధావన్ ఆస్తుల విషయంలో ఇచ్చిన ఆదేశాలు భారతీయ వివాహ చట్టాలకు విరుద్ధమని, అవి చెల్లవని పాటియాల హౌస్ కోర్టు పేర్కొంది. ధావన్ కెరీర్‌ను నాశనం చేస్తానని, తప్పుడు ఆరోపణలతో పరువు తీస్తానని ఆమె బెదిరించినట్లుగా కోర్టు గుర్తించింది. అందుకే ధావన్ తన సొంత డబ్బుతో కొన్న ఆస్తులను ఆమె పేరు మీద లేదా జాయింట్ పేర్ల మీద రిజిస్టర్ చేయాల్సి వచ్చిందని పేర్కొంది.

కాగా, శిఖర్ ధావన్, అయేషా ముఖర్జీ 2021లో విడిపోగా.. 2023లో వారికి అధికారికంగా విడాకులు మంజూరయ్యాయి. తన కుమారుడు జోరావర్ ను తన నుంచి దూరం చేసినందుకు ధావన్ మానసిక వేదన అనుభవించారని గతంలో కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ధావన్ ఇటీవలే సోఫీ షైన్‌ను వివాహం చేసుకున్నారు.

## దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఓడిపోయి మంచి పనే చేసింది !



స్పోర్ట్స్ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సూపర్ 8 మొదటి మ్యాచ్ లోనే భారత జట్టు ఓడిపోవడంపై రవి శాస్త్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. దక్షిణాఫ్రికా చేతిలో భారత జట్టు ఓడిపోయి మంచి పని చేసిందని బాంబు పేల్చారు. లేకపోతే ఇదే ఓవర్ కాన్ఫిడెన్స్ తో టోర్నమెంట్ లో ముందుకు భారత జట్టు వెళ్లి ఉంటే, పెద్ద ప్రమాదమే జరిగేదని హింట్ ఇచ్చారు. సూపర్ 8 మొదటి మ్యాచ్ లోనే భారత జట్టు నెగిటివ్ పాయింట్లు మొత్తం బయటపడ్డాయని వివరించారు. ఇక దక్షిణాఫ్రికా చేతిలో భారత్ జట్టు ఎందుకు ఓడిపోయింది ? ఏ రంగాల్లో భారత జట్టు విఫలమైంది ? ఎక్కడ మెరుగు కావాలి ? కొత్త ప్లేయర్లను తీసుకోవాలా ? లేదా? ఇలా అన్ని అంశాలపై సూర్య కుమార్ యాదవ్ సేన కసరత్తు చేయాలని సూచనలు చేశారు. జట్టును కోచ్ గంభీర్ ముందుండి నడిపించాలని కోరారు.

ఇకపై ఆ తప్పిదాలు చేయొద్దు..రవి శాస్త్రి సూచనలు

ఓటమి నుంచి కచ్చితంగా గుణపాఠం నేర్చుకొని బరిలోకి దిగాలని వెల్లడించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్ సందర్భంగా చేసిన తప్పిదాలు రిపీట్ కాకుండా, తర్వాత మ్యాచ్ లలో భారత్ ఇరగదీయాలని కోరారు. అలా జరిగితే టోర్నమెంట్ లో ఛాంపియన్ గా భారత్ నిలవడం గ్యారెంటీ అని సూచించారు. దీంతో రవి శాస్త్రి చేసిన కామెంట్లు వైరల్ గా మారాయి. అయితే సూపర్ 8 లో మొదటి మ్యాచ్ ఓడిపోయిన భారత జట్టు, తన తర్వాతి మ్యాచ్ జింబాబ్వే తో రేపు ఆడనుంది. చెన్నై వేదికగా ఈ మ్యాచ్ ఉంటుంది. మార్చి ఒకటో తేదీన వెస్టిండీస్ తో భారత్ మ్యాచ్ ఆడనుంది. ఈ రెండు జట్లపైన విజయం సాధించాలి. లేకపోతే సెమీఫైనల్ వెళ్లడం కష్టమే అవుతుంది.

## హాకీ గోల్‌కీపర్‌కు ప్రెసిడెన్షియల్ మెడల్ ప్రకటించిన ట్రంప్



స్పోర్ట్స్ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బుధవారం ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. మిలాన్ కోర్టినా ఒలింపిక్స్ పురుషుల హాకీ ఈవెంట్‌లో అమెరికాకు స్వర్ణ పతకం అందించిన గోల్‌కీపర్ కొన్నార్ హెల్లిబక్‌కు ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం అవార్డును ఇవ్వనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఆ ఒలింపిక్స్‌లో కెనడాతో జరిగిన గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో హెల్లిబక్ కీలక పాత్రను షోపించాడు. గోల్‌కీపర్‌గా అతను 41 గోల్స్‌ను సేవ్ చేశాడు. దీంతో మ్యాచ్ 1-1తో టై అయ్యింది. అయితే ఆ తర్వాత జాక్ హ్యూగ్స్ ఓ గోల్ స్కోరు చేయడంతో అమెరికా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నది. సెకండ్ హాఫ్‌లో తన స్టిక్‌తో హెల్లిబక్ గోల్‌ను ఆపడం మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్‌గా మారింది. ఒకవేళ ఆ గోల్‌ను సేవ్ చేయకుంటే, అప్పుడు పరిస్థితి మరోలా ఉండేది. ఐస్ హాకీలో చాన్నాళ్ల తర్వాత అమెరికా జట్టు గోల్డ్ మెడల్‌ను సాధించింది. దీంతో ప్రస్తుతం అమెరికా జట్టుపై ప్రశంసలు కురుస్తూనే ఉన్నాయి.

# మాస్ లుక్‌లో శర్వానంద్




టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ ఫ్యామిలీ, కామెడీ చిత్రాలకు ఎంతో పేరుగాంచిన. కానీ ఆయన ఎవరూ ఊహించని విధంగా.. మాస్ లుక్ లో తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 38వ చిత్రంలో నటిస్తున్నారు. 'భోగి' అనే పీరియాడిక్ యాక్షన్ డ్రామా ను త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా శర్వానంద్ కెరీర్‌లోనే మొట్టమొదటి పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా నిలవనుంది.

'ఎ బ్లడ్ ఫెస్ట్ అనే పవర్ ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రం కోసం శర్వానంద్ 'గంగ' అనే పాత్రలో పూర్తి మాస్, రగ్గడ్ లుక్‌లోకి మారిపోయారు. 1960వ దశకంలో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో జరిగిన కొన్ని యధార్థ సంఘటనల ఆధారంగా ఈ కథను రూపొందిస్తున్నట్లు తెలుస్తుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఈ చిత్రం ఆగస్టు 28, 2026న రక్షాబంధన్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా ఐదు భాషల్లో విడుదల కానుంది.

ఈ చిత్రంలో శర్వానంద్ సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హాయతి కథానాయికలుగా నటిస్తుండగా, రోహిత్ పాఠక్ కీలక పాత్రలో కనిపించనున్నారు. చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తుండగా, సౌందర్ రాజన్, కిషోర్ కుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలను దిలీప్ సుబ్బరాయన్ పర్యవేక్షిస్తుండగా, కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది. ఒక పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా శర్వానంద్‌ను సరికొత్త మాస్ యాక్షన్ హీరోగా నిలబెడుతుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

# కల్కి 2 షూటింగ్ స్టార్ట్..

## ప్రభాస్ కోసం వెయిటింగ్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడి' బ్లాక్ బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. దీంతో.. ఈ సినిమా సీక్వెల్ కోసం ఎదురు చూస్తున్నారు సినీ ప్రియులు. దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్ర షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఫస్ట్ షెడ్యూల్‌లో ఇద్దరు దిగ్గజ నటులు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ పాల్గొంటున్నారు. కల్కి మొదటి భాగంలో అమితాబ్ బచ్చన్ 'అశ్వత్థామ'గా తన విశ్వరూపాన్ని చూపించగా, కమల్ హాసన్ 'సుప్రీమ్ యాస్కిన్'గా సరికొత్త కనిపించారు. ఈ రెండు పాత్రలు ప్రేక్షకుల్లో విపరీతమైన క్యూరియాసిటీని పెంచాయి.


ఇప్పుడు వీరిద్దరూ సెట్స్‌లో సందడి చేసిన ఫోటోలు బయటికి వచ్చాయి. కమల్ హాసన్‌ను మళ్ళీ కలుసుకోవడం సంతోషంగా ఉంది.. అని అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్‌లో రాస్తూ.. షూటింగ్ సెట్ నుండి కొన్ని ఫోటోలను పంచుకున్నారు. దీంతో.. ఈ ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. అశ్వత్థామ, యాస్కిన్ మధ్య జరిగే పోరాట సన్నివేశాలు ఈ సీక్వెల్‌కు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర యూనిట్ వర్గాల సమాచారం. ఇక ఈ సీక్వెల్‌లో ప్రభాస్ ఎప్పుడు షూటింగ్‌లో పాల్గొంటారనే దానిపై కూడా స్పష్టత వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో కేవలం అమితాబ్, కమల్ హాసన్‌ల మధ్య కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రభాస్ తన ఇతర ప్రాజెక్టుల పని ముగించుకుని, తదుపరి షెడ్యూల్‌లో కల్కి 2 సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నాడు. వైజయంతీ మూవీస్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సీక్వెల్, మొదటి భాగం కంటే రెట్టింపు విజువల్ ఎఫెక్ట్స్ , యాక్షన్ ఎపిసోడ్స్‌తో ఉండబోతోంది. మరి కల్కి 2 ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

# మీ జీవితం అద్భుతంగా ఉండాలి

## విజయ్ - రష్మికలకు ప్రధానీ ఆశీస్సులు



నేడు పెళ్లిపీటలెక్కబోతోన్న నూతన వధూవరులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నాలకు ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకకు తనను ఆహ్వానించిన విజయ్ తల్లిదండ్రులకు ఆయన లేఖ రాశారు. ఈ నోట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. విజయ్ - రష్మికల వివాహ వేడుక ఆహ్వానం అందుకోవడం తనకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు మోదీ. వారి జీవితంలో ఇది అందమైన, కొత్త అధ్యాయానికి నాంది అని, సప్తపది పవిత్ర సంప్రదాయంతో జీవితాంతం స్నేహితులుగా, దంపతులుగా అన్యోన్యంగా ఉండాలని ఆశీర్వదించారు. సినిమాల్లోనే కాకుండా.. నిజజీవితంలోనూ వారిద్దరూ ప్రేమ, అనురాగాలతో నిండిన కొత్త అధ్యాయాన్ని అందంగా నిర్మించుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పరస్పర గౌరవంతో జీవిత ప్రయాణాన్ని కొనసాగించాలని, విజయ్ - రష్మికల జీవితం అద్భుతంగా ఉండాలని ఆకాంక్షించారు. కాగా.. నేడు ఉదయ్ పూర్ లో విజయ్ - రష్మిక పెళ్లివేడుక ఘనంగా జరుగనుంది.



प्रधान मंत्री
Prime Minister

New Delhi
फाल्गुन 05, शक संवत् 1947
24 February, 2026

Smt. Madhavi & Shri Goverdhan Rao Deverakonda Ji,

It is a pleasure to be invited by you to the wedding of Vijay and Rashmika to be held on 26 February 2026. Heartiest congratulations and greetings to the Deverakonda and Mandanna families on this truly joyous and auspicious occasion.

It marks the beginning of a new, beautiful chapter in the lives of Vijay and Rashmika. With the spirit of 'सखा सप्तपदा भव', meaning having taken seven steps together, the couple become friends for life.

Neither Vijay, nor Rashmika is new to scripts in their films. But this divinely scripted chapter of their real lives, filled with love and affection, will surely outshine the magic they have created on the silver screen.

May the days, months and years to come be filled with shared dreams and their fulfilment. With thoughtfulness and love, may they share responsibilities, embrace each other's imperfections, learn from each other's strengths and journey through life as true partners.

My blessings and best wishes to the couple and the families on the momentous occasion.

Warm regards,

(Narendra Modi)

Shri Goverdhan Rao Deverakonda

# అవకాశాలు ఉన్నప్పుడే

## ఆ విషయంలో జాగ్రత్త పడాలి

టాలీవుడ్ 'మిల్కీ బ్యూటీ' తమన్నా కేవలం వెండితెరపైనే కాదు, నిజ జీవితంలోనూ చాలా ప్రాక్టికల్‌గా ఆలోచిస్తారని మరోసారి నిరూపించుకున్నారు. 15 ఏళ్లకే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, దాదాపు 20 ఏళ్లుగా టాప్ హీరోయిన్‌గా కొనసాగుతున్న ఆమె, నటీనటుల ఆర్థిక క్రమశిక్షణ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. సినిమా రంగంలో గ్లామర్ ఉన్నప్పుడే భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టాలని, లేదంటే కెరీర్ ముగిశాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించింది.

తాజా ఇంటర్వ్యూలో తమన్నా తన ఆర్థిక ప్రణాళికల గురించి మాట్లాడుతూ.. 'నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నగారే చూసుకునేవారు. ఆయనే నాకు రియల్ ఎస్టేట్, జువెలరీ బిజినెస్ వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడం నేర్పించారు. ఇండస్ట్రీలో ప్రతి శుక్రవారం ఒకరి తలరాత మారిపోతుంది. అందుకే అవకాశాలు ఉన్నప్పుడే సంపాదించిన డబ్బును సరైన మార్గాల్లో ఆదా చేసుకోవాలి' అని ఆమె సూచించారు. అందుకే ప్రస్తుతం తమన్నా నటిగానే కాకుండా విజయవంతమైన వ్యాపారవేత్తగా కూడా రాణిస్తున్నారు. ఇప్పటికే నగల వ్యాపారం, రియల్ ఎస్టేట్‌లో ఆమె భారీగా పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. నటీనటులకు దూరదృష్టి లేకపోతే చివరకు ఏమీ మిగలదని, అందుకే ఆర్థిక క్రమశిక్షణ చాలా ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు.



Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com